ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

బుధవారం 9 ఏప్రిల్ 2025

5 రోజుల్లో చెదురుమదురు వర్షాలు

వరి, రాగి పంటల కోతలు వాయిదా వేసుకోండి

- నువ్వులో కాయ తొలుచు పురుగు నివారణ చర్యలు
- అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ముకుందరావు

-వార్త 8వ పేజీలో

సమన్వయంతో గంజాయి కట్టడి

విద్యా సంస్థల్లో 'ఈగల్' క్లబ్‌లు

- గంజాయిపై సమాచారానికి 1972 టోల్‌ఫ్రీ నంబర్
- కలెక్టర్ విజయకృష్ణన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, వివిధ శాఖల అధికారులు

అనకాపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే జిల్లా మీదుగా గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టవచ్చని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి జిల్లా నార్కో-ఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కమిటీలో ఉన్న అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, కళాశాలల అధ్యాపకులు, వసతిగృహాల వార్డెన్లతో 'ఈగల్' క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యా సంస్థల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలని చెప్పారు. గంజాయి వినియోగం, అమ్మకాలు జరుగుతున్నట్టు సమాచారం తెలిస్తే టోల్‌ఫ్రీ నంబరు 1972 కు సమాచారం అందించాలన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి నిరోధానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఏజెన్సీ నుంచి జిల్లాలోకి ప్రవేశించే తాటిపర్తి, కోనాం, డౌనూరు, భీమవరం, శ్రీరాంపురంలో శాశ్వత చెక్‌పోస్టులు, 38 పాయింట్లలో వాహన తనిఖీలు నిరంతరాయంగా జరగుతున్నాయని తెలిపారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు ... మిగతా 8వ పేజీలో



సింహాచలం అప్పన్న వార్షిక కల్యాణ వేడుకల్లో ముత్యాల తలంబ్రాలు చూపుతున్న పురోహితులు

అంగరంగ వైభవంగా అప్పన్న కల్యాణం

కన్నుల పండువగా ఎదురు సన్నాహోత్సవం

- సందడిగా సాగిన స్వామివారి రథోత్సవం
- భక్తుల హరి నామస్మరణతో మార్మోగిన సింహగిరి

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల హరి నామస్మరణతో సింహగిరి మార్మోగింది. అంతకుముందు కల్యాణానికి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం, ఎదురు సన్నాహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లు ప్రత్యేక రథంపై మాడ వీధుల్లో విహరించారు. రాత్రి పది గంటలకు ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అధిష్ఠింపజేసి అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును జరిపించారు. మాంగళ్యధారణ, జీలకర్ర, బెల్లం తదితర ఘట్టాలను ప్రత్యక్షంగా వీక్షించిన భక్తజనం తరించింది.

- వివరాలు 8వ పేజీలో



భక్తుల కోలాటం

హాస్టళ్లకు హంగులు!

సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు మరమ్మతులు

- మౌలిక వసతులతోపాటు కిటికీలకు దోమతెరలు
- జిల్లాలో 29 హాస్టళ్లకు రూ.4.2 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- 30 రకాల కొత్త వంట సామగ్రి సరఫరా

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాల రూపురేఖలు మారనున్నాయి. భవనాలకు మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు ఒక్కో వసతిగృహానికి పది లక్షల నుంచి ఇరవై లక్షల రూపాయాల వరకు ప్రభుత్వం మంజూరుచేసింది. జిల్లాలో మొత్తం 29 హాస్టళ్లు వుండగా రూ.4.2 కోట్లు కేటాయించింది. ఇప్పటికే పనులు మొదలయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేనాటికి పనులు పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు కృషి చేస్తున్నారు.



అనకాపల్లిలోని వసతి గృహంలో తుది దశలో వున్న మరమ్మతు పనులు



సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు సరఫరా చేసిన కొత్త వంట సామగ్రి

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 29 వసతి గృహాలు వున్నాయి. వీటిల్లో సుమారు మూడు వేల మంది విద్యార్థులు వుంటున్నారు. వైసీపీ అధికారంలో వున్న ఐదేళ్లలో ఒక్క ఏడాది కూడా మరమ్మతులకు నిధులు విడుదల చేయలేదు. పలు భవనాల శ్లాబ్‌లు పెచ్చులుఊడిపోయి, ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం పడితే శ్లాబ్ నుంచి నీరు కారుతున్నది. గచ్చులు అధ్వానంగా వున్నాయి. మరుగుదొడ్లకు తలుపులు సరిగా లేవు. విద్యుత్ వైర్లు, బోర్డులు అస్తవ్యస్తంగా వున్నాయి. కిటికీల తలుపులు ఊడిపోయి రాత్రిళ్లు దోమల బెడదతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో తాము అధికా రంలోకి వచ్చిన ఏడాదిలోగా సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు చేపట్టి, మౌలిక సదు పాయాలు కల్పిస్తామని గత ఎన్నికల సమ యంలో కూటమి పార్టీల నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత వసతిగృహాల స్థితిగతులు, మరమ్మతులకు ఎంత నిధులు అవసరం అవుతాయో నివేదిక పంపాలని సాంఘిక సంక్షేమ శాఖ అధి కారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పం పడంతో ఇటీవల నిధులు మంజూరయ్యాయి. వసతిగృహం ... మిగతా 8వ పేజీలో

తుదిదశకు టెన్త్ మూల్యాంకనం

- ఇప్పటికే 95 శాతం పూర్తి
- డీఈవో అప్పారావునాయుడు

అనకాపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ తుది దశకు చేరిందని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ, మూడు కేంద్రాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతున్నదన్నారు. 9వ తేదీలోగా మూల్యాంకన ప్రక్రియ ముగించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు చెప్పారు. జిల్లాకు 1,66,237 జవాబు పత్రాలు వచ్చాయని, వివిధ పాఠశాలలకు చెందిన 594 మంది ఉపాధ్యాయులు మూల్యాంకనంలో పాల్గొంటున్నారని తెలిపారు. ఒక్కో టీచర్ రోజుకు 35 నుంచి 40 జవాబు పత్రాలను దిద్దుతున్నారని చెప్పారు. జిల్లాకు కేటాయించిన జవాబు పత్రాల్లో ఇప్పటి వరకు 95 శాతం మూల్యాంకనం పూర్తయ్యిందన్నారు. మూల్యాంకనం పూర్తయిన పత్రాలను ఏ రోజుకారోజు ప్రత్యేక మెసెంజర్ ద్వారా విద్యా శాఖ ప్రధాన కార్యాలయానికి పంపుతున్నామన్నారు.

ప్రైవేటుకు ప్రసూతి కేసులు

పీహెచ్‌సీల నుంచి తరలిస్తున్న ఆశా కార్యకర్తలు

- ఒక్కో కేసుకు రూ.5 వేల చొప్పున కమీషన్
- ఆధారాలతోనే చెబుతున్నానన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వోకు ఆదేశం
- ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం

నర్సీపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పురుడు కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన కేసులను ఆశా వర్కర్లు నర్సీపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి, కమీషన్లు పొందుతున్నారని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. మంగళవారం కలెక్టర్ విజయకృష్ణన్‌తో స్థానిక ఎమ్మెల్యే హోదాలో ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ పీహెచ్‌సీల నుంచి 2023-24లో 398 ప్రసూతి కేసులు, 2024-25లో 498 ప్రసూతి కేసులను నర్సీపట్నంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారని గణాంకాలతో సహా వివరించారు. ఇందుకు ప్రతిఫలంగా ఆయా ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ఒక్కో ప్రసూతి కేసుకు రూ.5 వేల చొప్పున ఆశా కార్యకర్తలకు కమీషన్లుగా ఇస్తున్నారని, అన్ని ఆధారాలతోనే చెబుతున్నానని అన్నారు. ఆయా ప్రైవేటు ఆస్పత్రుల వద్ద వున్న సీసీ కెమెరాల పుటేజీని సేకరించామని, ఏ ఆశా కార్యకర్త, ఏ ఆస్పత్రికి, ఎంత మంది గర్భిణులను తీసుకువెళ్లారో చెప్పమంటే చెబుతానని అన్నారు. ఏరియా ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉండగా.. ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. పీహెచ్‌సీల నుంచి ప్రసూతి కేసులను ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతిని ఆయన ఆదేశించారు. ఏరియా ఆస్పత్రిలో ఉన్న రూ.70 లక్షలను ఆస్పత్రి అవసరాలకు వినియోగించాలని సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారదకు సూచించారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా కొత్త బోరు వేయించాలని ఆదేశించారు. ఆస్పత్రికి ప్రతీ నెలా కరెంటు బిల్లు ఎంత వస్తున్నదని ఆయన ప్రశ్నించగా.. రూ.2 లక్షలు ... మిగతా 8వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు. చిత్రంలో కలెక్టర్ విజయకృష్ణన్, డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ఉన్నారు.



హాజరైన ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

నేను మీ వాడినే!

నాదీ గిరిజనుల మనస్తత్వమే

- గిరిజన ప్రాంతమంటే ప్రాణం
- ప్రకృతి వనరులు చక్కగా ఉండాలని కోరుకుంటా..
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- డుంబ్రిగుడ మండలం కురిడి రచ్చబండలో గిరిజనులతో మమేకం



కురిడి గ్రామంలో రచ్చబండలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



అరకులోయ మండలం సుంకరమెట్ట కాఫీ ఎస్టేట్‌లో కాఫీ ట్రయల్‌ను ప్రారంభిస్తున్న పవన్‌కల్యాణ్. చిత్రంలో ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ సుజయకృష్ణ రంగారావు, అధికారులు

పాడేరు/డుంబ్రిగుడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'నేను గిరిజనుడిగా పుట్టకపోయినా నాది మీలాంటి మనస్తత్వమే. మీరు ఏ విధంగా అయితే అడవి తల్లి బాగుండాలని కోరుకుంటారో, నేను కూడా అలాగే ఆలోచిస్తాను'.. అని గిరిజనులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతమంటే ఇష్టంతోపాటు ఇక్కడ ప్రకృతి వనరులు చక్కగా ఉండాలని కోరుకుంటానని చెప్పారు. కేరళ తరహాలో గిరిజన ప్రాంతంలో ప్రకృతిని కాపాడుకుంటూనే పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపడతామని, వ్యవసాయంతో, ఆధ్యాత్మిక పర్యాటకంతో ఇక్కడ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ యువతి... తన తమ్ముడికి కాలేయం పాడైపోయిందని, వైద్యం అందించాలని కోరగా, అక్కడే ఉన్న ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్‌కు ఆ బాధ్యతను అప్పగించారు. గిరిజన ప్రాంతంలో రక్తహీనతతో బాధ పడుతున్నారని పలువురు తెలపగా, స్పందించిన కలెక్టర్ ఏజెన్సీలో సికిల్‌సెల్ ఎనీమియా కారణంగా గిరిజనుల్లో ఎక్కువగా రక్తహీనత సమస్య ఉందని, దానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని, బ్లడ్ బ్యాంక్ కావాలని డిప్యూటీ సీఎంను కోరారు. కాఫీ తోటల అభివృద్ధికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించాలని కోరారు. అందుకు అవసరమైన చర్యలు చేపడతామని పవన్‌కల్యాణ్ తెలిపారు. అనంతరం అరకులోయ మండలం సుంకరమెట్ట సమీపంలో కాఫీ తోటల్లో ఏర్పాటు చేసిన చెక్క వంతెనకు ప్రారంభోత్సవం చేసి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు.

దుమ్ము రేగుతున్న రోడ్లు

వాహనదారులు, ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు

- లంకెలపాలెం రోడ్డులో పేరుకుపోయిన బూడిద

సబ్బవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం-లంకెలపాలెం రోడ్డులో పరవాడ మండలంలోని సింహాద్రి ఎన్టీపీసీ పవర్ ప్లాంటు నుంచి నిత్యం బూడిద లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో దుమ్ము, ధూళి పెద్ద ఎత్తున ఎగిసి పడుతున్నది. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సబ్బవరం పరిసర ప్రాంతాల్లో ఇటుకల తయారీకి, విశాఖ-రాయపూర్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో ల్యాండ్ ఫిల్లింగ్‌కు బూడిదను తరలిస్తున్నారు. అయితే బూడిద రవాణా చేసేటప్పుడు కనీస నిబంధనలు పాటించడంలేదు. పరిమితికి మించి లోడ్ చేయడంతో దారిలో కుదుపులకు లారీలో నుంచి బూడిద జారి రోడ్డుపై పడుతున్నది. అదే విధంగా పైన టార్పాలిన్ కప్పకపోవడంతో గాలి వీచినప్పుడు తెల్లటి బూడిద పెద్ద ఎత్తున లేచి, ఇతర వాహనదారులు, ప్రయాణికుల కళ్లల్లో పడుతున్నది. దీనివల్ల ద్విచక్రవాహదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాక ఈ మార్గంలో వున్న అనకపల్లి, ఎరుకునాయుడుపాలెం, పైడివాడఅగ్రహారం, పెదముషిడివాడ తదితర గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులే కాకుండా రోగాలబారిన పడుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న ఇళ్లు, దుకాణాలు, పంట పొలాలు, మామిడి తోటల్లో చెట్లపైన బూడిద పేరుకుపోతున్నది.



అసకపల్లి-లంకెలపాలెం మధ్య రోడ్డుపై పేరుకుపోయిన ఫ్లైయాష్.. వాహనం వెళుతుంటే పెద్దఎత్తున లేస్తున్న బూడిద



మాడుగుల మండలం ఎం.కోటపాడు వద్ద దట్టంగా లేచిన దుమ్ము

వడ్డాది-పాడేరు రోడ్డులో..

మాడుగుల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వడ్డాది-పాడేరు ఆర్అండ్‌బీ రోడ్డులోని మాడుగుల మండలం కేజేపురం జంక్షన్, ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం, డి.సురవరం వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడంతో వాహనాల రాకపోకలు సాగించే సమయంలో దుమ్ము, ధూళి ఎగిసిపడుతున్నది. దీంతో ... మిగతా 8వ పేజీలో

ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌కు అనూహ్య స్పందన



పాలిటెక్నిక్ కోచింగ్‌కు హాజరైన విద్యార్థులు

ఎస్. రాయవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద గుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌కు అనూహ్య స్పందన లభిస్తుందని, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఈ కోచింగ్ సెంటర్‌కు ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల, ఎలమంచిలి మండలాలకు చెందిన 93 మంది హాజరై శిక్షణ పొందారన్నారు. ఉపాధ్యాయులు గోవింద్, రామేష్ విద్యార్థులకు గణిత బోధనలో శిక్షణ అందించారు. కోచింగ్‌కు హాజరైన విద్యార్థులకు పీఆర్‌టీయూ బృందం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసింది.

పేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

పాయకరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం పాయకరావుపేటలో జరిగిన సంఘ సభ్యుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షునిగా పి.ఐజయ, అధ్యక్షునిగా ఎం.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షునిగా ఎం.విజయకుమార్, కార్యదర్శిగా బి.అరుణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా డి.శ్రీనివాసరావు, కోశాధికారిగా డి.నాని, ఉప కోశాధికారిగా డి.ఇస్సాక్‌తోపాటు కార్యవర్గ సభ్యులుగా సతీష్ కుమార్, పి.ఇస్సాక్, కె.కారల్‌పాల్ స్టీవెన్, ప్రసన్నకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు ఎం.దానియేలు, కె.ఆశీర్వాదం, ఎం.దయారత్నం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఎలమంచిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ఎప్పటికప్పుడు వృత్తినైపుణ్యతను పెంపొందించుకోవాలని ఎలక్ట్రానిక్ మీడియా(ఏపీఈఎమ్‌జెఏ)రాష్ట్ర కార్యదర్శి చింతల కిషోర్ అన్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన కార్యవర్గ సమావేశంలో ఏపీయూడబ్ల్యూజె రాష్ట్ర ప్రతినిధి స్వామి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు జోగినాయుడు, చంద్రరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఏపీ. అప్పారావు జర్నలిస్టుల సామాజిక బాధ్యత, వృత్తి నైపుణ్యం, తదితర అంశాలపై సూచనలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. రాంబాబు, గెమ్మెళ్ల గోవిందరావు, స్థానిక ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు దుబాసి రమణ, ఆడారి గంగాధర్, డి.సుబ్బరాజు, పోలిశెట్టి శ్రీమాన్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా గంగరాజు



ఎస్.రాయవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా ఎస్. రాయవరం గ్రామానికి చెందిన మురుకుర్తి గంగరాజు నియమితులయ్యారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

'పేదరిక నిర్మూలనే లక్ష్యం'

మునగపాక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని స్థానిక ప్రభుత్వ పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం రుణ, జీవనోపాధి ప్రణాళికలపై జరిగిన అవగాహనలో ఆయన మాట్లాడుతూ సభ్యులు జీవనోపాధికి సంబంధించి వివరాలను సేకరిస్తున్నారని చెప్పారు. వెలుగు ఏపీఎం బాలరాజు పొదుపునకు సంబంధించి పలు అంశాలను వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం జంక్షన్‌లో రోడ్డు విస్తరణ సందర్భంగా విద్యుత్ లైన్ల పనులు జరుగుతున్నందున బుధవారం ఐదు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. రోడ్డు విస్తరణ వల్ల భారీ వృక్షాలు తొలగించాల్సి ఉన్నందున బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అచ్యుతాపురం, రామన్నపాలెం, మోసయ్యపేట, చోడపల్లి, భోగాపురం పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఉపాధి శిక్షణకు 21 మంది ఎంపిక



ఇంటర్వ్యూల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ కొండలరావు

ఎలమంచిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 21 మంది ఎంపికైనట్లు ఎంపీడీఓ కేఎస్. కొండలరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్య అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు 31 మంది పాల్గొన్నట్లు తెలిపారు. వీరిలో 21 మంది ఎంపికయ్యారని, మిగిలిన వారిని పరిశీలనలో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ. ప్రసాదరావు సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా సదస్సును విజయవంతం చేయండి

ఎలమంచిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో ఏప్రిల్ 11వ తేదీన జరగనున్న సీపీఐ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు అన్నారు. మంగళవారం జిల్లా సదస్సు కరపత్రాలను స్థానిక నేతలతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సదస్సులో సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ, నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సన్యాసిరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి, జిల్లా నేతలు మణికంఠ, సంతోష్, సునీల్, పోతురాజు పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యులకు మరిన్ని ప్రోత్సాహకాలు

మునగపాక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సభ్యులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించడం కోసం ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని డీఆర్‌డీఏ ఫైనాన్స్ డీపీఎం శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో టి.సిరసపల్లిలో మంగళవారం డ్వాక్రా సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యుల స్థితిగతులను తెలుసుకొని వారి జీవనోపాధికి రుణాలు మంజూరుకు ప్రభుత్వం ఆలోచనలు చేస్తోందన్నారు. వెలుగు సీసీ శ్రీను, వీఓఏ ఉష, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

నేడు జనవాణి కార్యక్రమం

మునగపాక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఈనెల 9వ తేదీన జనవాణి కార్యక్రమం జరగనుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు.

ఓపెన్ బార్‌గా ఎలమంచిలి క్రీడా మైదానం

- మందుబాబుల అడ్డాగా మారిన వైనం
- చీకటి పడితే గ్లాసుల గలగల
- ఇబ్బంది పడుతున్న క్రీడాకారులు, వాకర్స్
- పట్టని పోలీసులు, నిర్వాహకులు





మైదానంలో మద్యం సీసాలను ఏరుతున్న జూనియర్ క్రీడాకారులు (ఇన్‌సెట్‌లో) మద్యం బాటిళ్లు

ఎలమంచిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌గాంధీ క్రీడా మైదానం ఓపెన్ బార్‌గా మారింది. సాయంత్రం అయితే మందుబాబులకు అడ్డా అయ్యింది. ఖాళీ మద్యం సీసాలతో మైదానం నిండిపోతోంది. ప్రతి రోజూ అభ్యాసన చేసేందుకు వచ్చే క్రీడాకారులు ఈ ఖాళీ మద్యం సీసాలను ఏరివేసి బయటకు పారేయడం తలనొప్పిగా మారింది.

ఎలమంచిలి పట్టణ నడిబొడ్డున ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాజీవ్‌గాంధీ క్రీడా మైదానం రాత్రి అయితే మందుబాబులకు బార్‌లా ఉపయోగపడుతోంది. చీకటి పడితే మందుబాబులు మద్యం సేవించడం, తర్వాత సీసాలు పగలుగొట్టడం చేస్తున్నారు. అయితే దీనిపై నిర్వాహకులు గానీ, పోలీసులు గానీ దృష్టి సారించడం లేదు. దీంతో మందుబాబులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. మద్యం సీసాలను పగులగొట్టడంతో సాధన చేసే సమయంలో క్రీడాకారులకు గాజుముక్కలు గుచ్చుకున్న సందర్భాలు లేకపోలేదు. మైదానంలో మద్యం సేవిస్తున్న వారిపై పోలీసులు దృష్టి సారించకపోవడంపై పట్టణ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాకింగ్ చేసే యువతీ, యువకులు, సీనియర్ సిటిజన్స్, హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్ తదితర క్రీడల్లో తర్ఫీదు పొందేందుకు ప్రతి రోజూ వందలాది మంది క్రీడామైదానానికి వస్తుంటారు. వాకింగ్ చేసే సమయంలో, క్రీడలు ఆడుతున్న సమయంలో చెంతనే వాడి పడేసిన మద్యం సీసాలు కనిపిస్తుండడంతో వారు అసహనానికి గురవుతున్నారు. వాటిని తీసి బయటకు పారేస్తున్నారు. పోలీసు అధికారులతోపాటు మైదానం నిర్వాహకులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మైదానంలో మందుబాబులకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

నేత్రపర్వంగా శివపార్వతుల ఎదురు సన్నాహం

- పెండ్లిమాటలను కళ్లకు కట్టినట్టు వివరించిన గాయత్రీదేవి



శివ,పార్వతుల కల్యాణోత్సవం సందర్భంగా ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహిస్తున్న ప్రముఖ పండితురాలు డాక్టర్ గాయత్రీదేవి

నక్కపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక శివాలయంలో శివపార్వతుల వార్షిక కల్యాణోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వెలవలపల్లి మహేశ్, సంతోశ్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. రాత్రి 8 గంటలకు నక్కపల్లిలోని మైలవరభట్ల జోగారావు నివాసం వద్ద శివపార్వతుల ఎదురు సన్నాహ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. సింగంశెట్టి కుటుంబీకులు, జోగారావు కుటుంబీకులు ఏర్పాట్లు చేశారు. ప్రముఖ వేదపండితురాలు డాక్టర్ గాయత్రీదేవి అయ్యవారు, అమ్మవారి పెండ్లిచూపులు, పెండ్లి మాటలను అద్భుతంగా వివరించారు. శివ నామస్మరణ వల్ల కలిగే ప్రయోజనం, దక్ష యజ్ఞం గురించి ఆమె చేసిన వ్యాఖ్యానం భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు,పండితులు శ్రీపాద ప్రణవ్‌రామ్, పండుశర్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, జడ్పీటీసీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు,టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, సర్పంచ్ వీరబాబు, ఉపమాక, నక్కపల్లి గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా శివ పార్వతుల ఊరేగింపు

ఉపమాకలో మంగళవారం రాత్రి శివపార్వతుల ఊరేగింపు ఘనంగా జరిగింది. సప్పరం వాహనంపై పరమేశ్వరుడు, పల్లకీలో అమ్మవారిని అలంకరించి ఉపమాక నుంచి నక్కపల్లి వరకూ ఊరేగింపు చేపట్టారు. మైలవరభట్ల జోగారావు ఇంటి వద్ద ఎదురు సన్నాహ మహోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఉపమాక కోలాట బృందం చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.డాక్టర్ గాయత్రీదేవి సహా పలువురిని కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో పెద్దలు ఘనంగా సన్మానించారు.

వైభవంగా బొర్రేశ్వరస్వామి కల్యాణం



ఎస్.రాయవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మంగళవారం రాత్రి ఉమాసహిత బాల త్రిపుర సుందరి సమేత బొర్రేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెలవలపల్లి బొర్రేశ్వర శర్మ ఆధ్వర్యంలో పలువురు పురోహితుల వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని, స్వామి వారి కల్యాణాన్ని కనులారా తిలకించారు. అంతకుముందు సాయంత్రం ఎదురు సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎస్.రాయవరంలో బొర్రేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

సంక్షేమం, అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

కూటమి నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, తోట నగేశ్



చిన నర్సాపురంలో పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన నాయకుడు తోట నగేశ్ అన్నారు. మండలంలోని పెదరాంభద్రపురం శివారు చిన నర్సాపురంలో మంగళవారం ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పల్లెల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంపల మార్తమ్మ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథ్, ఉపసర్పంచ్ మంచిగంటి రాజు, టీడీపీ నాయకులు శింగంశెట్టి నాగేశ్వరరావు, కలిగట్ల శ్రీనువాసరావు, చింతకాయల రాంబాబు, జూరెడ్డి ప్రసాద్, గన్నియ్య, సత్యనారాయణ, వేములపూడి అప్పారావు, కొండబాబు, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

అనంతరం పెదరాంభద్రపురంలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూటమి నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, తోట నగేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డెక్కన్ కెమికల్స్ కంపెనీ ప్రతినిధి వెంకటపతిరాజు, సర్పంచ్ గంపల మార్తమ్మ పాల్గొన్నారు.

కారిడార్ పనులను అడ్డుకున్న రాజయ్యపేట గ్రామస్థులు



కారిడార్ భూముల్లో పనులు జరగకుండా అడ్డుకున్న నిర్వాసితులు

నక్కపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట గ్రామంలో మంగళవారం వీసీఐఆర్ భూముల్లో జరుగుతున్న పనులను కారిడార్ నిర్వాసిత రైతులు అడ్డుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వాసిత రైతులు పనులు జరుగుతున్న చోటికి వెళ్లి అడ్డుకున్నారు. విషయం తెలిసిన నక్కపల్లి సర్కిల్ పోలీసులు మొహరించారు. తహసీల్దార్ నర్సింహమూర్తి అక్కడకు చేరుకుని నిర్వాసిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఎం నేత అప్పలరాజు మాట్లాడుతూ నిర్వాసిత రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ ఇచ్చిన తరువాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో ఎం.మహేశ్‌బాబు, పిక్కి సత్తిబాబు, పిక్కి కోదండరావు, గొడ్డు రాజు, చేడిపల్లి రాజు, గోసల అంజి, మైలపల్లి బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

ఈదటంలో తాగు నీటి పైపుల లీకులు



హైస్కూల్ సమీపంలో తాగునీటి పైపు లీకులతో బయటకు వచ్చిన నీరు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదటం గ్రామంలో తాగునీటి పైపుల లీకేజీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈదటం గ్రామం శివారు పాల్మన్‌పేటకు వెళ్లే రోడ్డులో వేసిన పైపులైన్ల ద్వారా గ్రామానికి తాగునీరు సరఫరా అవుతుంది. అయితే గ్రామానికి తాగునీరు సరఫరా చేసే పైపులైన్ పలు చోట్ల లీకేజీలు అవుతున్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. లీకేజీల ద్వారా వచ్చిన నీరు మరల పైపులోకే వెళ్లడం వలన తాగునీరు కలుషితమై రోగాల బారిన పడే అవకాశం వుందని వారు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోనూ, సంపద కేంద్రం వెనుక ప్రాంతంలో పైపులైను లీకులు ఏర్పడ్డాయని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే తాగనీటి పైపులకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భూవివాదంలో కిరాయి వ్యక్తుల దాడి

దేవరాపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):పొలంలోకి వెళ్తున్న తమపై కిరాయి వ్యక్తులు దాడి చేశారంటూ ఎ.కొత్తపల్లికి చెందిన లక్కరాజు దేముడమ్మ, కంచిపాటి పద్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలాలిలా ఉన్నాయి. మండలంలోని ఎ.కొత్తపల్లిలో 6.80 ఎకరాల భూమిని 21 ఏళ్లుగా తాము సాగు చేస్తున్నామని, ఈ భూమి విషయంలో వేరొకరితో కోర్టులో వివాదం నడుస్తుందని లక్కరాజు దేముడమ్మ, కంచిపాటి పద్మ తెలిపారు. ఈ భూమిపై స్టేటస్ కో ఆర్డర్ కోర్టు ఇచ్చిందన్నారు. అయితే సింగందొరపాలెంకు చెందిన వెలుగ పైడంనాయుడు తాను కొనుగోలు చేశానంటూ తరచూ దౌర్జన్యం చేస్తున్నాడని వారు ఆరోపించారు. మంగళవారం మధ్యాహ్నం తాము పొలంలోకి వెళ్తుండగా విశాఖపట్నంకు చెందిన 30 మంది కిరాయి వ్యక్తులు తమపై దాడి చేశారన్నారు. తమ దగ్గర ఉన్న యాసిడ్‌తో దాడి చేస్తామని బెదిరించారని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కిరాయి వ్యక్తులను తాము ప్రశ్నించగా సింగందొర పాలెంకు చెందిన పైడంనాయుడు పంపించారని చెప్పారని బాధిత మహిళలు తెలిపారు. అయితే వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా.. కొందరు పారిపోగా ఐదుగుర్ని పట్టుకొని పోలీసులకు అప్పగించామన్నారు. దౌర్జన్యాలకు దిగిన కిరాయి వ్యక్తులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా రెవెన్యూ రికార్డుల ఆధారంగా కొనుగోలు చేసిన భూమిలోకి వెళ్తుండగా ఎ.కొత్తపల్లికి చెందిన వారు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పైడంనాయుడు తెలిపారుఎ.

బాల్య వివాహాలు, బాల కార్మికులపై ప్రత్యేక దృష్టి

- జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి లోవరాజు



సమావేశంలో మాట్లాడుతున్న లోవరాజు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ కమిటీల ద్వారా బాల్య వివాహాలు, బాల కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి డి. లోవరాజు అన్నారు. మండలంలోని గెడ్డపాలెం గ్రామంలో మంగళవారం 11 మంది సభ్యులతో కూడిన విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ నూతన కమిటీలను ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తన్నీరు గంగలక్ష్మి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు తన్నీరు ఎరకయ్య, వైస్ సర్పంచ్ సత్యనారాయణ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నారాయుడుపాలెంలో ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులను ప్రారంభించిన శ్రీనివాసరావు

మునగపాక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయుడుపాలెంలో మంగళవారం ఉపాధి హామీ పనులను మండల టీడీపీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దేశించిన సమయం వరకు పనిచేయడం ద్వారా పూర్తిస్థాయి పేమెంటును పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు సబ్బి శ్రీనివాసరావు, కొయ్య రమణ, శేషు, శ్రీను, దాసరి గోపాలకృష్ణ, మల్లయ్య పాల్గొన్నారు.

నాలుగు అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీ

మునగపాక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చునని సీడీపీవో ఇందిరాదేవి తెలిపారు. మండలంలో మూలపేట, టి.సిరసపల్లి-1, తిమ్మరాజుపేట-1, మునగపాక-4 కేంద్రాల్లో ఆయా పోస్టులకు ఎలమంచిలి ఐసీడీఎస్ కార్యాలయానికి నేరుగాను, రిజిస్టర్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

13న ఉమ్మలాడ నుంచి రథయాత్ర ప్రారంభం



ఎలమంచిలిలో సిద్ధం చేసిన అయోధ్య శ్రీరామ రక్షారథం

ఎలమంచిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీ నుంచి నియోజకవర్గంలో ప్రారంభం కానున్న రథయాత్ర ప్రారంభానికి అంతా సిద్ధం చేశారు. అయోధ్య శిల్ప కళాకారులచే రూపొందించిన ఈ రథం మంగళవారం ఎలమంచిలికి చేరుకుంది. ఈనెల 13వ తేదీన మునగపాక మండలం ఉమ్మలాడ గ్రామంలో ఈ రథయాత్ర ప్రారంభం అవుతుందని, అనంతరం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో కొనసాగుతుందని ఎస్ఎస్ఎఫ్ ప్రతినిధి ఆడారి గంగాధర్ తెలిపారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నైపుణ్య శిక్షణ తరగతులకు 53 మంది ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాశరావు

పాయకరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్య శిక్షణ సంస్థ, సీడీప్‌ల ద్వారా ఇచ్చే ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులకు 53 మంది ఎంపికైనట్టు ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో నైపుణ్య శిక్షణ తరగతులకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నాలుగు మండలాల నుంచి 80 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా.. వీరిలో 53 మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారికి త్వరలో శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో జాబ్ ట్రైనర్ షర్మిల, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, వెలుగు సిబ్బంది దేవతారెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లు వద్దు.. నగదు ఇవ్వాలి

- కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి ఇన్‌చార్జి అనంతరావు

అచ్యుతాపురం ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు కాకుండా నగదు ఇవ్వాలని కాంగ్రెస్ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి తనకాల అనంతరావు డిమాండ్ చేశారు ఈమేరకు మంగళవారం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో తప్ప గ్రామీణ ప్రాంతాల్లో టీడీఆర్ బ్యాండ్లు ఉపయోగపడవన్నారు. భూములకు గ్రామానికొక ధర నిర్ణయించారని, అలాకాకుండా సెంటు భూమికి రూ.15 లక్షలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు, రేపు సాగర్ కవచ్ కార్యక్రమం

అచ్యుతాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మెరైన్, నేవీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు బుధ, గురువారాల్లో సాగర్ కవచ్ కార్యక్రమాన్ని అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గల తీరప్రాంతాల్లో నిర్వహించనున్నారు. సాగర మార్గం ద్వారా ఉగ్రవాదులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారు వస్తే వారిని గుర్తించి, ఎలా పట్టుకోవాలనే దానిపై రెండు రోజులు మాక్‌డ్రిల్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పూడిమడక తీరంలో భారీగా పోలీసులు మోహరించారు. అలాగే పూడిమడక తీరంలో నుంచి అచ్యుతాపురం వైపు వెళ్లే దారులన్నింటిలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి వాహనాలు తనిఖీలు నిర్వహిస్తారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, మెరైన్‌సీఐ సింహాద్రి నాయుడు, అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.


పవన్ కల్యాణ్‌కు చిత్రపటం అందిస్తున్న గణేశ్, తదితరులు

పవన్ కల్యాణ్‌కు ఘన సత్కారం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామంలో జరిగిన రచ్చబండలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సబ్బవరపు గణేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అరకువేలీ నియోజకవర్గ పరిశీలకులు సబ్బవరపు గణేశ్‌తో పాటు అరకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఆర్టీసీ విజయనగరం రీజనల్ చైర్మన్ దొన్నుదొర పవన్‌కల్యాణ్‌కు చిత్రపటాన్ని అందించిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిరంజీవి, మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షులతో ప్రమాణం


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో న్యూ కాలనీలోని రోటరీ కల్యాణ మండపంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశం జరిగింది. జిల్లాలోని మండలాలకు, పట్టణాలకు నియమితులైన అధ్యక్షులతో మీసాల సుబ్బన్న ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారి కోసం ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రత్యామ్నాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్ దత్తు, ఎం.కోటేశ్వరరావు, టి.అనంతరావు, పి.కొండలరావు, ఎం.చక్రవర్తి, వి.రాము, బి.కిశోర్, ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్


ఎన్టీఆర్ జంక్షన్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోడ్లు, డివైడర్లపై ఆక్రమణలను తొలగించేందుకు జీవీఎంసీ అధికారుల సహకారంతో ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ ప్రత్యేక చర్యలు చేపట్టారు. నెహ్రూచౌక్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, నెహ్రూచౌక్ నుంచి ఎన్టీఆర్ జంక్షన్, ఎన్టీఆర్ జంక్షన్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం రోడ్లల్లో డివైడర్లపైన, రోడ్లపై ఉన్న వ్యాపారాలను మంగళవారం తొలగించారు. అలాగే ఎన్టీఆర్ విగ్రహం నుంచి పెరుగుబజార్ వరకు ఉన్న ఆక్రమణలను తొలగించామని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. ఆక్రమణదారులపై టౌన్ న్యూసెన్స్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు డి.శేఖరం, ఎస్‌కే.రషీద్, పోలీసు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

▸▸ చోరీ చేసిన సొమ్ము విషయమై వివాదం: డీఎస్పీ శ్రావణి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణి

రావికమతం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికంలో కొలిపాక పవన్ కుమార్(22) హత్య కేసును పోలీసులు ఒక్క రోజు వ్యవధిలో ఛేదించారు. మంగళవారం రావికమతం పోలీస్ స్టేషన్‌లో అనకాపల్లి డీఎస్పీ శ్రావణి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

మండలంలోని గర్నికంలో మేడివాడకు చెందిన కొలిపాక పవన్‌కుమార్ హత్య ఆదివారం జరిగింది. దీంతో కొత్తకోట సీఐ జి. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రావికమతం, కొత్తకోట, రోలుగుంట ఎస్ఐలు బృందాలుగా ఏర్పడి అనుమానితులైన వేపాడ నరేంద్రకుమార్, కేతా దుర్గాప్రసాద్, ఒక బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించారన్నారు. మృతుడు పవన్‌కుమార్, వేపాడ నరేంద్రకుమార్, కేతా దుర్గాప్రసాద్ తరచూ గొడవలు పడేవారన్నారు. ఆదివారం మధ్యాహ్నం పవన్‌కుమార్, వేపాడ నరేంద్రకుమార్, కేతా దుర్గాప్రసాద్, బాలుడు కలిసి రావికమతం చెరకు కాటా సమీపంలో మద్యం సేవించి, అక్కడే బిర్యానీ తిని రాత్రి వరకు గడిపారన్నారు. అక్కడే హతుడు పవన్‌కుమార్, హంతకుడు నరేంద్రకుమార్ ఘర్షణ పడ్డారన్నారు. రాత్రికి మేడివాడలో నిద్రించాలని భావించిన వారంతా బైక్‌పై గర్నికం సినిమాహాలు సమీపంలోకి వెళ్లేసరికి మళ్లీ గొడవపడ్డారు. నా డబ్బులు ఎందుకు దొంగలించావురా అంటూ వేపాడ నరేంద్రకుమార్ పవన్‌కుమార్‌ని గట్టిగా నిలదీశాడు. ఈ సందర్భంగా ఇరువురు ఘర్షణ పడగా.. పక్కనే ఉన్న మద్యం బాటిల్‌ను పగలగొట్టి పవన్‌కుమార్ కంఠంపైన, ఎడమ చాతి భాగంపై పొడిచాడని డీఎస్పీ శ్రావణి తెలిపారు. దీంతో పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మిగిలిన ఇద్దరు ఘటనా స్థలంలోనే ఉండి నరేంద్ర కుమార్‌కు సహకరించారన్నారు. ప్రధాన నిందితుడైన వేపాడ నరేంద్రకుమార్ నుంచి ఒకటిన్నర తులాల బంగారం గొలుసు, రూ.35 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నరేంద్రకుమార్‌పై అనకాపల్లి జిల్లా, విశాఖ సిటీ పరిధిలో 10 కేసులు ఉన్నాయన్నారు. అలాగే రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో నరేంద్రకుమార్, కేతా దుర్గాప్రసాద్ మోటార్ సైకిళ్ల దొంగతనాలు చేసి రావికమతం పరిసర ప్రాంతాల్లో విక్రయించేవారని దర్యాప్తులో తెలిందన్నారు. వాటిని త్వరలోనే రికవరీ చేస్తామన్నారు. .పవన్‌కుమార్ హత్యతో సంబంధం ఉన్న వేపాడ నరేంద్రకుమార్, కేతా దుర్గాప్రసాద్, మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించినట్టు చెప్పారు. బాలుడిని జువైనల్‌కు తరలిస్తామని డీఎస్పీ శ్రావణి తెలిపారు. నిందితులను ఒక్క రోజు వ్యవధిలో పట్టుకున్న కొత్తకోట సీఐ కోటేశ్వరావు, రావికమతం, కొత్తకోట ఎస్ఐలు రఘువర్మ, శ్రీనివాస్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ శ్రావణి అభినందించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

▸▸ ఇద్దరు ఫార్మా ఉద్యోగులకు గాయాలు

పరవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఫార్మా ఉద్యోగులు గాయపడ్డారు. గాజువాక-ఎలమంచిలి ప్రధాన రహదారిలోని బొట్టవానిపాలెం వద్ద మంగళవారం ఉదయం ఈ సంఘటన చోటు చేసుకుంది. లంకెలపాలెం, ఫార్మా పునరావాసకాలనీకి చెందిన పి.సాయిరాంబ, పల్లి రామకృష్ణ అచ్యుతాపురం సెజ్‌లోని లారస్ ల్యాబ్స్ పరిశ్రమలో క్యూసీ విభాగంలో పనిచేస్తున్నారు. మంగళవారం వారిద్దరు ద్విచక్ర వాహనంపై విధులకు బయలుదేరారు. సరిగ్గా వీరు బొట్టవానిపాలెం వద్దకు వెళ్లేసరికి, అదే రహదారిలో ఎదురుగా వస్తున్న కారు వీరిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం ధాటికి ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. క్షతగాత్రులను విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక కృషి

సైబర్ క్రైమ్స్, సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలి: ఎస్పీ తుహిన్ సిన్హా


పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

సబ్బవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అలాగే స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులను, సిబ్బంది పనితీరును సమీక్షించారు. తరచూ జరుగుతున్న నేరాల ఫైళ్లను సమగ్రంగా పరిశీలించారు. ఆయా కేసుల పురోగతపై సమీక్ష చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వస్తున్న పేదలు, వృద్ధులు, మహిళల సమస్యలను అర్థ చేసుకుని, సమస్యలను పరిష్కరించి వారికి సహకరించాలని సూచించారు. బేసిక్ పోలీసింగ్ నిర్వహిస్తూ, విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజల్లో నమ్మకం పెంపొందించాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి తాగే వారి వివరాలు సేకరించాలని, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆయన సూచించారు. రౌడీషీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులు వివరాలు సేకరించి, వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. దొంగతనాల నియంత్రణకు పటిష్టంగా గస్తీ అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, సబ్బవరం సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐలు పి.సింహాచలం, దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సమగ్రాభివృద్ధికి విద్యే మూలం

▸▸ విద్యా వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించింది

▸▸ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

సబ్బవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రాభివృద్ధికి విద్యే మూలమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంగళవారం 17వ వార్షికోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశం అభివృద్ధి చెందాలంటే విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉండాలన్నారు. దురదృష్ట వశాత్తు వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని పట్టాలు ఎక్కించేందుకు ఆ శాఖ మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. ఒక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, ఇక్కడ నుంచే తాను ఎమ్మెల్సీగా వెళ్లానని ఆయన తెలిపారు. ఈ కళాశాలలో సమస్యలన్నీ పరిష్కరించి, అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి చదివితే సాధించలేనిదేమీ లేదని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణానికి రూ.80 లక్షలు, వసతి ఏర్పాటుకు మరో రూ.2.3 కోట్లు మంజూరైనా ఆర్థికపరమైన అనమతి రావాల్సి ఉందన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీని కోరారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.శంకరరావు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ విజయవంతంగా నిర్వహించాలి

▸▸ ఐసీడీఎస్ పీవో లలితకుమారి


పోషణ్ పక్వాడ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సీడీపీవో లలితకుమారి

సబ్బవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించనున్న పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వి.లలితకుమారి సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ్ పక్వాడ కార్యక్రమంలో నాలుగు దశల్లో చిన్నారులకు ఇవ్వాల్సిన పౌష్టికాహారంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. గర్భం దాల్చిన దగ్గర నుంచి వెయ్యి రోజుల వరకూ ఇవ్వాల్సిన పోషకాహారం కోసం తానే రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బాలింతలు తమ బిడ్డలకు ఏ విధంగా పాలు అందివ్వాలి, అప్పుడే పుట్టిన బిడ్డలను ఎలా చూసుకోవాలి, మూడు, ఆరు నెలలప్పుడు ఏ విధంగా చూసుకోవాలనే అంశాలపై ఆమె అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యకరమైన జీన విధానాన్ని అలవరచాలని సూచించారు. వయసు తగిన విధంగా బరువు ఉన్నది లేనిది చూసుకోవాలన్నారు. పిల్లలు జంకు ఫుడ్‌కు దూరంగా ఉండేలా చూడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఆర్.పైడితల్లి, బీపీఎల్.నళినీ, కె.మణికుమారి, హెచ్.వెంకటవరలక్ష్మీ, మహిళా పోలీసులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలంటూ నిరసనలు



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు



పరవాడ: దేశపాత్రునిపాలెం ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల పై బాదుడు కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి రూ.50 గ్యాస్ ధర పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పుండు మీద కారం చల్లిన చందంగా మళ్లీ గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమన్నారు. పెట్టుబడుదారులకు, కార్పొరేట్‌లకు లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రజల పై భారాలు మోపడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ పథకంపై కూడా భారం మోపిందని వాపోయారు. పెంచిన ధరలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లురాజు, జి.నాయనబాబు, కె.ఈశ్వరరావు, కె.తేలయ్యబాబు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ: పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం దేశపాత్రునిపాలెం వద్ద ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం సామాన్య ప్రజానీకంపై భారం మోపడమేనన్నారు. ఎన్నికల ముందు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పెంచడం దారుణమన్నారు. ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.పరమేశ్వరి, తులసీ, నారాయణమ్మ, జి.లక్ష్మి, ఎం.సత్తిబాబు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పైడారావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ముఖ్య సలహాదారుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు కోరారు. మంగళవారం ఆయన నివాసంలో ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పట్టణంలో ఎక్కడ చూసినా ఒక పక్క కుక్కల బెడద, మరో పక్క దోమలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. విశాఖ జీవీఎంసీ పరిధిలో ఉన్న అనకాపల్లి పట్టణంలో అభివృద్ధి రోజు రోజుకి వెనుకబడుతుందని విమర్శించారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు మాట్లాడుతూ పట్టణ సమస్యలపై ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా స్పందన కనిపించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బొట్టా చిన్నియాదవ్, ఎ.ప్రవీణ్ కుమార్, కొల్లి చినఅప్పారావు, కె.మంగరాజు, బొబ్బిలి గోవింద, ఆడారి బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల దీక్షలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఆర్టీసీ ఎన్ఎంయూఏ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఈ దీక్షలు 39వ రోజుకు చేరాయి. తప్పుడు కేసులు రాసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెన్షన్ చేసిన డ్రైవర్, కండక్టర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు ఇచ్చారు. ఈ దీక్షల్లో కెఎస్.నారాయణ, పీవీఎస్.రావు, బీఆర్ రావు, కేటీ.రావు కూర్చొన్నారు.

పవన్ కుమారుడు కోలుకోవాలని ప్రత్యేక పూజలు


మరిడిమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

కొత్తూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకరన్ త్వరగా కోలుకోవాలని జనసేన నాయకులు విజయరామరాజుపేటలో ఉన్న మరిడిమాంబ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా 82వ వార్డు జనసేన పార్టీ కన్వీనర్ ఆళ్ల రామచంద్రరావు మాట్లాడుతూ సింగపూర్‌లో గాయపడిన మార్క్ శంకర్, తోటి విద్యార్థులు త్వరగా కోలుకోవాలని పూజలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోలారపు త్రినాథ్, దాడి జగన్, అప్పికొండ గణేశ్, ఆకుల నానాజీ, వాసు, భర్నికాన రాము, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తి గేయాలు


గాయని బృందాన్ని సత్కరిస్తున్న రూరల్ సీఐ అశోక్‌కుమార్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన భక్తి గేయాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విశాఖపట్నం శంకరమఠంనకు చెందిన బృంద సభ్యులు ఆలపించిన భక్తి గేయాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం చినముషిడివాడకు చెందిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి హారతి ఇచ్చి పూజలు చేశారు. కాగా, కళాకారులను అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

11న జ్యోతిబాపూలే జయంతి

▸▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గుండాల జంక్షన్‌లో ఉన్న ఎస్ఆర్ శంకరన్ కాంప్లెక్స్‌లో శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బీసీ నాయకులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె సూచించారు.

ముత్యమాంబ అనుపోత్సవం రేపు


ముత్యమాంబ అమ్మవారు

సబ్బవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చినగొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం ముత్యమాంబ అమ్మవారి అనుపోత్సవం గురువారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్తు కాంతులతో సర్వాంగ సందరంగా అలంకరించారు. బుధవారం తొలేళ్ల ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద సాముగరిడీలు, బళ్లవేషాలు, కోయి వేషాలు, కోలాటం ప్రదర్శన, గురువారం సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, అనంతరం అనుపోత్సవం జరుగుతుందని చెప్పారు.

నేటి నుంచి దుర్గమాంబ జాతర


దుర్గమాంబ అమ్మవారు

పరవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ.బోనంగి పంచాయతీలోని బొద్దపువానిపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ జాతరను బుధవారం నుంచి నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన రహదారి నుంచి అమ్మవారి ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. బుధ, గురువారాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

29 మందికి కంటి ఆపరేషన్లు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 29 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. వీరిని ప్రత్యేక వాహనంలో శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి పంపినట్టు శిబిరం నిర్వాహకుడు పూసర్ల రాజా తెలిపారు. ఐదేళ్లుగా అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, సాయిరాజా వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం పంపిన కంటి రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా శంకర్ ఫౌండేషన్ ఆపరేషన్లు చేస్తుందని ఆయన తెలిపారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజల కోసం శాస్త్రవేత్తల బృందం డిమాండ్

పరవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ల్యాబ్ హెల్పర్ చీపురుపల్లి అప్పలనాయుడు మృతికి కారణమైన రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజల కోసం శాస్త్రవేత్తలు బృందం ప్రతినిధులు కె.బాబూరావు, కె.వెంకట్‌రెడ్డి, డి.రాంబాబు, అహ్మద్‌ఖాన్, ఎం.బాహుజీ డిమాండ్ చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగా రాంకీ యాజమాన్యానికి చెందిన సీఈటీపీలో ల్యాబ్ హెల్పర్ చీపురుపల్లి అప్పలనాయుడు విష రసాయనాలు పీల్చి శనివారం రాత్రి మృతి చెందడం దారుణమన్నారు. కార్మికుల ప్రాణాలంటే యాజమాన్యానికి పట్టింపు లేదని అసహనం వ్యక్తం చేశారు.

ఘనంగా కొల్లాటమ్మ పండుగ

పరవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావాడ ప్రజల ఆరాధ్య దైవం కొల్లాటమ్మ అమ్మవారి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు అమ్మవారి ఆలయం వద్ద బారులు తీరారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఉప సర్పంచ్ కావలి అప్పలరాజు, నాయకులు దాసరి వెంకటరమణ, కోన కృష్ణ, సాలాపు వెంకటరమణ తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని ఘటాలను గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

ఉపాధి కూలీల ఆందోళన

పరవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి పథకం కూలీలు రేఖవానిపాలెంలో మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.సత్యనారాయణ మాట్లాడుతూ కూలీల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. కూలీల్లో ప్రతి కుటుంబానికి ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని, పే స్లిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు షకీలాబేగం, భారతి, సోములమ్మ, లక్ష్మి, మదీనా, రమణి, అలీ, మునీషా తదితరులు పాల్గొన్నారు.


పని ప్రదేశంలో నినాదాలు చేస్తున్న కూలీలు

అరకులోయ బస్ కాంప్లెక్స్‌ను ఆధునికీకరిస్తాం

» ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర

అరకులోయ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పర్యాటకంగా ప్రసిద్ధి చెందిన అరకులోయ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌ను ఆధునికీకరిస్తామని ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర తెలిపారు. ఇటీవల విజయనగరం రీజియన్ ఆర్టీసీ ఈడీగా బాధ్యతలు చేపట్టిన బ్రహ్మానందరెడ్డి మంగళవారం అరకులోయలో దొన్నుదొరను మర్యాదపూర్వకంగా కలవడానికి విచ్చేశారు. అనంతరం వారు ఆర్ఎం అప్పలనాయుడు, పాడేరు డిపో మేనేజర్‌తో కలిసి అరకు ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. మౌలిక సౌ కర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా చైర్మన్‌తోపాటు విలేకర్లతో మాట్లాడారు. పర్యాటకులకు తగ్గట్లుగా అరకు బస్‌కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కాంప్లెక్స్ పరిసరాలను అం దంగా తీర్చిదిద్దుతామన్నారు. టాయ్‌లెట్స్, బాత్‌రూంలు మరికొన్ని అదనంగా నూతనంగా నిర్మిస్తామన్నారు. సందర్భంగా అరకులోయ నుంచి విజయనగరానికి ఉదయం వేళ, సాయంత్రం విజయనగరం నుంచి అరకులోయకు తిరిగి ప్రయాణం చేసేలా బస్సు సర్వీసులను నడపాలని, విశాఖపట్నం-అరకులోయ మీదుగా జైపూర్ బస్సును పునరుద్ధరించాలని స్థానిక పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, ఉపసర్పంచ్ చందు ఈడీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే, శుక్ర, ఆదివారాల్లో (సంతరోజుల్లో) గిరిరైతుల సౌకర్యార్థం కార్గో బస్సులను నడపాలని, ప్రతీ డీలక్స్ బస్సు ప్రయాణికులు అధికంగా వేచి ఉండే సుంకరమెట్ట, కాశీపట్నంలలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలోలా అరకులో ప్రతీ బస్ నైట్‌హాల్ట్ ఉండేలా విన్నవించారు. అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ ప్రాంత విలేకర్లు అరకులోయ నుంచి ఎస్.కోట మీదుగా విశాఖ వెళ్లే బస్సులో ఉచిత పాస్‌లు చెల్లుబాటు అయ్యేలా చూడాలని వారు ఈడీ, ఆర్ఎం దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై చర్చించి అమలుకు కృషి చేస్తామని ఈడీ బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు.


అరకులోయ ఆర్టీసీ కాంప్లెక్స్ ను పరిశీలిస్తున్న విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మేన్ దొన్నుదొర, ఈడీ బ్రహ్మానందరెడ్డి తదితరులు


డప్పు వాయిద్యాలతో ఇళ్ల ఎదుట గిరిజనులు


వాహనదారులనుంచి (పజోర్) చందా వసూలు చేస్తున్న మహిళలు

గిరిజన సంప్రదాయ ఇటుకల పండగ ప్రారంభం

డుంబ్రిగుడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంప్రదాయమైన ఇటుకల పండగ మంగళవారం ప్రారంభమైంది. తొలకరి చినుకులు పడడంతో ఈ విత్తనాల పండుగను నిర్వహించడం ఆనవాయితీ. ఈ పండగ ప్రాంతాలవారీగా నెల రోజులపాటు జరుపుకుంటారు. గ్రామాల్లో ఈ పండగ ప్రారంభం నుంచి ఎటువంటి పనులు చేయరు. కాదని ఎవరైనా ఏ పనులు చేపట్టితే (ఇనుప పనిముట్లతో కూడిన పనులు, మహిళలు బట్టలు ఉతకడం) సంప్రదాయ ప్రకారం అపరాధ (దండుగా) రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ పండగ వారం రోజులు మహిళలు గ్రామ సమపంలోని రోడ్డు వద్ద ప్రయాణించే వాహనాల నుంచి (పజోర్) చందా వసూలు చేస్తారు. ఈవిధంగా వచ్చిన డబ్బుతో మహిళలు సరదాగా ఏదో వస్తువులు కొనుగోలు చేస్తారన్నారు. గ్రామంలో ఉన్న మగాళ్లందరినీ ఒక చోట చేర్చి తిలకం దిద్ది గ్రామానికి తూర్పు వైపున గల పర్వతానికి వేటకు పంపిస్తారు. వేటకు వెళ్లిన పురుషులు మాంసం (పిట్టలు, కుందేళ్ల,) వంటి వాటిని తీసుకువస్తారు. వీటితో వంట చేసుకుంటూ గ్రామస్థులంతా భుజిస్తారు. చిన్న పిల్లలకు వీధి అరుగుల్లో తాడుసాయంతో ఊయలలు ఏర్పాటు చేస్తారు. గ్రామంలో వరసకు బావ మరదళ్లు నీళ్లు జల్లుకుంటు సంతోషంగా గడుపుతారు. పండగ ముగిసే చివరి రోజు గ్రామ దేవత (పెదదేవుడు) గ్రామ దేవత వద్ద వైభవంగా విత్తనాల పూజ చేస్తారు. మరుసటి రోజు గ్రామ శివారున సంప్రదాయ థింసా నృత్యాలతో సందడి చేస్తూ ఆనందంగా గడుపుతారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న గ్రామ పెద్దలు

కొయ్యూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు శరభన్నపాలెం- కంపరేగుల రహదారికి మోక్షం లభించింది. గత నెలలో 'ఈ గ్రామాలకు దారేది' అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి అధికారులు, పాలకులు స్పందించారు. ఇందులో భాగంగా పీఎం జన్‌మన్ పథకంలో శరభన్నపాలెం నుంచి కంపరేగులు నాలుగు కిలోమీటర్ల రోడ్డు నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో గ్రామపెద్దలు ఈశ్వరావు, చి న్నాలరావు, పి. సత్తిబాబు, దేముడు, బాలు తదితరులు మంగళవారం ఈ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు డౌనూరు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గోవిందరావు పాల్గొన్నారు.

గుర్రాయి జలపాతాన్ని అభివృద్ధి చేయాలని వినతి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ, టీడీపీ నాయకులు

జి.మాడుగుల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుంబిడిసింగి పంచాయతీ గుర్రాయి జలపాతాన్ని అభివృద్ధి చేయాలని స్థానిక సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీపీ అప్పలరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు మండల టీడీపీ నాయకులతో కలిసి ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ జలపాతాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటకంగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంటుందనివివరించారు. సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో కలెక్టర్‌కు దీనిపై నివేదిక అందజేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలిచిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు వంతాల కొండలరావు, భీంబాబు, శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

'అధికారుల దృష్టికి మేడూరు సమస్యలు'

చింతపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ మేడూరులో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు అన్నారు. మంగళవారంగ్రామంలో గిరిజనులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వంతల రాజుబాబు, పాంగి చంటిబాబు, వంతల సందేశ్, పాంగి రామ్, మల్లేశ్, సూరిబాబు, ప్రసాద్, పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు ఉత్పత్తి ప్రారంభించాలి: ఎంపీడీవో


జర్రెల సందన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

చింతపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):పంచాయ తీ పరిధిలోని సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు ఉత్పత్తి ప్రారంభించాల ని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం మొండిగెడ్డ, జర్రెల చెత్త నుంచి సంపద తయారీ(ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో మాట్లాడుతూ గృహాల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. అనంతరం జర్రెల పంచాయతీలో చలివేంద్రాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

» ట్రైనీ ఎస్ఐలకు ఎస్పీ అమిత్ బర్దార్ సూచన


శిక్షణకు వచ్చిన ఎస్ఐలకు సూచనలందిస్తున్న ఎస్పీ అమిత్ బర్దార్

పాడేరురూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, కేసుల పరిష్కారంలో నిష్పక్ష పాతంగా ఉండాలని ఎస్పీ అమిత్ బర్దార్ సూచించారు. ఏలూరు, విశాఖపట్నం రేంజ్ పరిధిలో ఎస్ఐలుగా శిక్షణ పూర్తి చేసుకొని జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో 30 రోజుల శిక్షణ పొందేందుకు మంగళవారం పాడేరు చేరుకున్న 37 మంది ట్రైనీ ఎస్ఐలతో జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా పలు కేసులు ఛేదించడంలో మెలుకువలు, పీఎస్‌లో రికార్డుల నిర్వాహణ, స్టేషన్ల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పెట్టీ కేసులు, సైబర్ నేరాలను తెలుసుకోవాలని కోరారు. మత్తుపదార్థాలతో కలిగే నష్టాలు, శక్తి యాప్‌లపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. జిల్లా మావోయిస్టు ప్రాబల్యం ఉన్న ప్రాంతం కావడంతో ఎటువంటి జాగ్రత్తలు ఉన్నతాధికారుల సూచనలను తప్పక పాటించాలన్నారు. అనంతరం శిక్షణలో ఉన్న 37 ఎస్ఐలను వివిధ పోలీసు స్టేషన్‌లకు కేటాయించారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

» పవన్ కల్యాణ్‌కు జడ్పీటీసీ సభ్యుడి వినతి


ఉపముఖ్యమంత్రి పవన్‌ను కలిసి జడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. బొర్రా నుంచి కొనపురం మీదుగా లోతేరు ఉన్న రోడ్డు మరమ్మతులు చేయించాలని, దేవరాపల్లి నుంచి పినకోట, పెదకోట, కివర్ల మీదుగా హుకుంపేట మండలానికి బీటీ వేయాలని, దీంతో మారో 9 రోడ్లకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని వినతి అందజేశారు. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్ సానుకూలంగా స్పందించినట్టు జడ్పీటీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలోని టోకూరు సర్పంచ్ మోస్య, తదితరులు ఉన్నారు. సుంకరమెట్ట ఉడెన్ బ్రిడ్జి ప్రారంభించేందుకు వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అనంతగిరి మండలానికి చెందిన వీరమహిళ రత్నప్రియ కలిసి ప్రధాన సమస్యలను వివరించారు. గ్రామాల్లో డ్రైనేజీ, తారురోడ్లు, సీసీరోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈమె వెంట జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చిట్టం మురళి, తదితరులు ఉన్నారు.

గంజాయి వద్దు.. తృణ ధాన్యాల సాగు ముద్దు


బోయఊటలో ప్రచారం చేస్తున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగుతో అనర్థాల్లో చిక్కుకునేకన్నా ప్రభుత్వ సహకారంతో సంప్రదాయ పంటలను వేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి ఉమాదేవి గిరిజనులకు సూచించారు. మంగళవారం మండలంలోని నల్లగొండ పంచాయతీ బోయఊట గ్రామంలో గంజాయి సాగుతో కలిగే అనర్థాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి సాగు, రవాణాతో చట్టా రీత్యా చర్యలను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. ప్రస్తుతం తృణధాన్యాలైన రాగులు, సామలు, కొర్రలు, తదితర పంటలకు ఎంతో పాధాన్యం ఉందన్నారు వీటి వల్ల అధిక ఆర్థికాభివృద్ధి సాధించటం సులువన్నారు. ఈ పంటలకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందన్నారు. ప్రతీ రైతు గంజాయికి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు వీహెచ్ఏ హరి పాల్గొన్నారు.

ఘనంగా జాంకారమ్మ ఉత్సవాలు


కిండంగిలో జాంకారమ్మను దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు

పాడేరురూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి తదితరులు కిండంగి గ్రామంలో జరిగిన జాంకారమ్మ మహోత్సవాల్లో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను చేపట్టారు. గిరిజన ప్రాంతంలో పంటలు పండేందుకుజాంకారమ్మ తల్లి అనుగ్రహిస్తుందని ఈ ప్రాంత ప్రజల విశ్వాసం. ఈ నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డుంబేరు విశ్వనాథం, క్లస్టర్ ఇన్‌చార్జ్ త్రినాథ్, గడుతుల మురళీ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలు, రోడ్లు పూర్తి చేయాలి


మంత్రి సంధ్యారాణిని కలిసి సమస్యలను వివరిస్తున్న లక్ష్మణరావు

చింతపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయి భవనాలు, రహదారుల నిర్మించాలని గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి విజ్ఞప్తి చేసినట్టు టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణ రావు అన్నారు. సోమవారం రాత్రి అరకులోయ వచ్చిన మంత్రికి వినతి పత్రం అందజేశామన్నారు.ప్రధానంగా అంజలిశనివారం రహదారి నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పూర్తి చేయలేకపోయిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిధుల కేటాయింపునకు సిద్ధమైనా కాంట్రాక్టర్ ముందుకురావడంలేదన్నారు. అలాగే టీడీపీ ప్రభుత్వ హయంలో మంజూరైన పెద్దూరు-పెద్దగెడ్డ రహదారిని వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. ఈ మార్గంలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఈరహదారుల నిర్మాణాలకు కృషి చేయాలని మంత్రిని కోరినట్టు చెప్పారు. చింతపల్లిలో వైద్యుల నివాస గృహం, మినీ స్టేడియం పూర్తి చేయాలని కోరినట్టు చెప్పారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

గోదావరి డెల్టాకు నీటి విడుదల నిలిపివేత

సీలేరు, ఏప్రిల్ 8 , (ఆంధ్రజ్యోతి): డొంకరాయి జలాశయం స్పిల్‌వే గేట్ల నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి విడుదలను మంగళవారం నుంచి నిలిపివేసినట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవ రావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు దవళేశ్వరం వద్ద నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడంతో పాటు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే 4300 క్యూసెక్కులు సరిపోకపోవడంతో డొంకరాయి నుంచి అదనపు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు జెన్‌కో ఉన్నతాధికారులు కోరారన్నారు. ఈ నేపథ్యంలోడొంకరాయి నుంచి ఫిబ్రవరి 10 నుంచి నీటిని 3 వేల క్యూసెక్కుల చొప్పున, మార్చి ఒకటి నుంచి 4 వేల క్యూసెక్కుల చొప్పున, మార్చి 21 నుంచి 5 వేల క్యూసెక్కుల చొప్పున విద్యుత్ ఉత్పత్తి లేకుండా నేరుగా గోదావరి డెల్టాకు విడుదల చేసినట్టు సీఈ తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి ఏప్రిల్ 7 రాత్రి వరకు 15 టీఎంసీల నీటిని సరఫరా చేశామన్నారు.

'అక్రమ కట్టడాలను నివారించండి'

జి.మాడుగుల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం ఇరువైపులా అక్రమ కట్టడాలను నివారించాలని పెసా కమిటీ మండల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, మండలంలోని అక్రమ కట్టడాలకు సంబంధించి బినామీలపై చర్యలు చేపట్టాలని కోరారు. బినామీ దారులకు కరెంటు, ఇంటి పన్ను తదితర బిల్లులు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెసా మండల కార్యదర్శి బాలకృష్ణ, సోమన్నదొర, పెద్దబ్బాయి, దేవి నాయుడు, లక్ష్మయ్య, సుధాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం చింతపల్లి ప్రాంతాన్నీ పట్టించుకోవాలి: కాంగ్రెస్

సీలేరు, ఏప్రిల్ 8 , (ఆంధ్రజ్యోతి): చింతపల్లి నియోజక వర్గం పరిధిలోని చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు, మండలాలు అభివృద్ధిపైనా రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టి సారించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కారే శ్రీనివాస్ కో రారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు వహించడంతో ఒకప్పటి చింతపల్లి నియోజక వర్గ పరిధిలోని ఈ మూడు మండలాలు అభివృద్ధి పరంగా బాగా వెనుక బడి ఉన్నాయన్నారు. జిల్లా పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు, వైరామవరం మండలాలు అభివృద్ధికి కూడా కృషి చేయాలని కోరారు.

సమస్యలపై వీఆర్ఏల నిరసన

చింతపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏలకు అదనపు విధుల భారం తగదని సంఘం మండల అధ్యక్షుడు కుర్రజ్జ కల్యాణం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ బి. రవికుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా కల్యాణం మాట్లాడుతూ వీఆర్ఏలకు నిబంధనలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు, ఇసుక ర్యాంపులు, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు చేయిస్తున్నారన్నారు. ఈవిధులు వీఆర్ఏలకు సంబంధంలేదన్నారు. టీఏ, డీఏలు సైతం చెల్లించడం లేదన్నారు. తెలంగాణలో వీఆర్ఏలకు పేస్కేల్ జీతం ఇస్తున్నారని, రాష్ట్రంలోనూ పేస్కేల్ జీతం అందజేయాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగానున్న అటెండర్, వాచ్‌మన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలన్నారు. వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని, నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి లోచల కృపారావు, సభ్యులు కంటా బాలరాజు, బేరా రాణి పాల్గొన్నారు.

పెదబయలు: సమస్యలపై మండలంలోని 23 పంచాయితీల గ్రామ రెవెన్యూ సహాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అ నంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ రంగారావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు జీ నీలకంఠం మాట్లాడుతూ గత ఎని మిదేళ్లుగా తమకు జీతాలు పెంచకపోవటంతో కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నామన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, తమ సమస్యలను మాత్రం పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కనీస వేతనం రూ. 26వేలు చెల్లించి, అర్హులకు పదోన్నతి కల్పించాలన్నారు. నైట్ డ్యూటీలు, ఇసుక క్వారీల వద్ద కాపలాలు రద్దు చేయాలన్నారు. నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని కోరారు.


ముంచంగిపుట్టులో రెవెన్యూ అధికారులకు వినతి పత్రమిస్తున్న వీఆర్ఏలు, సీఐటీయూ నాయకులు

ముంచంగిపుట్టు: వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి పి.భీమరాజు అన్నారు. ఈమేరకు రెవెన్యూ అధికారులకు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు శ్యామ్, లోయిదాస్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలను పూర్తి చేయాలి: డ్వామా పీడీ


కొండిబలో ఫారంఫండ్ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ విద్యాసాగర్, అధికారులు

అనంతగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నీటి కుంటలను సకాలంలో పూర్తి చేయాలని డ్వామా పీడీ విద్యాసాగర్ ఆదేశించారు.మండలంలోని కొండిబ పంచాయతీలోని ఫారం ఫండ్ పనులను పీడీ మంగళవారం పరిశీలించారు. నీటికుంట వద్ద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 600 ఫారంఫండ్ (నీటి కుంటలను) జూన్ 30లోగా పూర్తి చేసేలా క్షేత్రస్థాయి, అధికారులు సి బ్బంది కృషిచేయాలన్నారు. లేనిపక్షంలోని చర్యలు తప్పవని హెచ్చరించారు. నీటి కుంటల వల్ల భూగర్భ జలాలు పెంపొంది, బోర్లు, బావులకు జీవంనకు దోహదం చేస్తాయి.వర్షపునీటిని నిల్వతో సాగునీరందుతుందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులందరికీ జాబ్‌కార్డులతోపా టుగా ఉపాధి పనులు కల్పించాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో ఏవీవీ కుమార్, ఏపీడీ పవన్, ఏపీవోలు సన్యాసిరావు, అర్జున్, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాల జోలికి పోవద్దు: ఎస్ఐ


బాలలకు పుస్తకాలు అందిస్తున్న ఎస్ఐ రమణ

పెదబయలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చట్ట విరుద్ధ కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ కొల్లి రమణ సూచించారు. మంగళవారం మారుమూల ఇంజరీ పంచాయతీ పరిధి గిన్నెగరువు గ్రామాన్ని సందర్శించారు. గిరిజనులతో సమావేశమై మాట్లాడారు. గంజాయి, నాటు సారా నిర్మూలనకు సహకరించాలన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పేకాట, కోడి పందేలు జోలికి వెళ్ల వద్దని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. మహిళలు శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. అనంతరం బాలలకు విద్యా సామగ్రి ఉచితంగా అందించారు. పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గిరిజనులకు రాయితీపై మిరియాలు వలిచే యంత్రాల పంపిణీ


మిరియాలు వలిచే యంత్రాలతో గిరిరైతులు, సబల్ ప్రోగ్రామ్ అధికారులు

పాడేరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.గొందూరు గ్రామంలో మంగళవారం ఎంపిక చేసిన తొమ్మిది మంది గిరిజన రైతులకు సబల్ ప్రాజెక్టు, వాసస్ సంస్థ ఆధ్వర్యంలో రాయితీపై మిరియాలు వలిచే యంత్రాలను పంపిణీ చేశారు. ఆయా యంత్రాలను ఒక గ్రామంలోని రైతులంతా సామాజికంగా వినియోగించేందుకు గానూ పంపిణీ చేశామని సబల్ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ నాయుడు తెలిపారు. వాటిని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.40 వేలు విలువ చేసిన ఒక్కో యంత్రాన్ని రాయితీపై కేవలం రూ.5 వేలకు అందించడంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సబల్ ప్రాజెక్టు, వాసస్ సంస్థ ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య


మణికంత (ఫైల్ ఫొటో)

పాడేరురూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మద్యం వ్యసనం మానుకోవాలని తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాడేరు నీలకంఠానగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి సీఐ డి.దీనబంధు తెలిపిన వివరాలివి.. నీలకంఠానగర్‌కు చెందిన కెల్ల అప్పారావు కుమారుడు మణికంఠ(28) ద్విచక్ర వాహనాల మెకానిక్ వద్ద పనిచేస్తుంటాడు. మణికంఠ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మణికంఠమద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో తండ్రి అప్పారావు మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన మణికంఠ ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ముంచంగిపుట్టులో భారీ వర్షం


ఆకాశంలో మెరుపుతో రాత్రి తొమ్మిది సమయంలో పట్టపగలు తలపిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ ఠారెత్తించింది. రాత్రి 8 గంటల నుంచి ఈదురు గాలులు, ఉరుము, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంది. రహదారులు వర్షపు నీటితో చిత్తడిగా మారాయి. వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో మంగళవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి.సాయంత్రం నాలుగు గంటల సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పుకనిపించి గంటపాటు చిరుజల్లులు కురిశాయి.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

▸▸ చోరీ చేసిన సొమ్ము విషయమై వివాదం: డీఎస్పీ శ్రావణి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణి

రావికమతం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికంలో కొలిపాక పవన్ కుమార్ (22) హత్య కేసును పోలీసులు ఒక్క రోజు వ్యవధిలో ఛేదించారు. మంగళవారం రావికమతం పోలీస్ స్టేషన్‌లో అనకాపల్లి డీఎస్పీ శ్రావణి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలోని గర్నికంలో మేడివాడకు చెందిన కొలిపాక పవన్‌కుమార్ హత్య ఆదివారం జరిగింది. దీంతో కొత్తకోట సీఐ జి. కోటేశ్వరావు ఆధ్వర్యంలో రావికమతం, కొత్తకోట, రోలుగుంట ఎస్‌ఐలు బృందాలుగా ఏర్పడి అనుమానితులైన వేపాడ నరేంద్రకుమార్, కేతా దుర్గాప్రసాద్, ఒక బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించారన్నారు. మృతుడు పవన్‌కుమార్, వేపాడ నరేంద్రకుమార్, కేతా దుర్గాప్రసాద్ తరచూ గొడవలు పడేవారన్నారు. ఆదివారం మధ్యాహ్నం పవన్‌కుమార్, వేపాడ నరేంద్రకుమార్, కేతా దుర్గాప్రసాద్, బాలుడు కలిసి రావికమతం చెరకు కాటా సమీపంలో మద్యం సేవించి, అక్కడే బిర్యానీ తిని రాత్రి వరకు గడిపారన్నారు. అక్కడే హతుడు పవన్‌కుమార్, హంతకుడు నరేంద్రకుమార్ ఘర్షణ పడ్డారన్నారు. రాత్రికి మేడివాడలో నిద్రించాలని భావించిన వారంతా బైక్‌పై గర్నికం సినిమాహాలు సమీపంలోకి వెళ్లేసరికి మళ్లీ గొడవపడ్డారు. నా డబ్బులు ఎందుకు దొంగలించావురా అంటూ వేపాడ నరేంద్రకుమార్ పవన్‌కుమార్‌ని గట్టిగా నిలదీశాడు. ఈ సందర్భంగా ఇరువురు ఘర్షణ పడగా.. పక్కనే ఉన్న మద్యం బాటిల్‌ను పగలగొట్టి పవన్‌కుమార్ కంఠంపైన, ఎడమ చాతి భాగంపై పొడిచాడని డీఎస్పీ శ్రావణి తెలిపారు. దీంతో పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మిగిలిన ఇద్దరు ఘటనా స్థలంలోనే ఉండి నరేంద్ర కుమార్‌కు సహకరించారన్నారు. ప్రధాన నిందితుడైన వేపాడ నరేంద్రకుమార్ నుంచి ఒకటిన్నర తులాల బంగారం గొలుసు, రూ.35 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నరేంద్రకుమార్‌పై అనకాపల్లి జిల్లా, విశాఖ సిటీ పరిధిలో 10 కేసులు ఉన్నాయన్నారు. అలాగే రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో నరేంద్రకుమార్, కేతా దుర్గాప్రసాద్ మోటార్ సైకిళ్ల దొంగతనాలు చేసి రావికమతం పరిసర ప్రాంతాల్లో విక్రయించేవారని దర్యాప్తులో తెలిందన్నారు. వాటిని త్వరలోనే రికవరీ చేస్తామన్నారు. .పవన్‌కుమార్ హత్యతో సంబంధం ఉన్న వేపాడ నరేంద్రకుమార్, కేతా దుర్గాప్రసాద్, మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించినట్టు చెప్పారు. బాలుడిని జువైనల్‌కు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు. నిందితులను ఒక్క రోజు వ్యవధిలో పట్టుకున్న సీఐ కోటేశ్వరావు, ఎస్‌ఐలు రఘువర్మ, శ్రీనివాస్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ శ్రావణి అభినందించారు.

డ్రోన్లతో గంజాయి రవాణా కట్టడి: సీఐ రేవతమ్మ



గంజాయి రవాణాపై డ్రోన్‌తో పరిశీలిస్తున్న సీఐ రేవతమ్మ

గొలుగొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లో గంజాయి రవాణా నివారణకు డ్రోన్లతో సర్వే నిర్వహిస్తున్నట్టు నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతం, రహదారుల్లో గంజాయి రవాణాపై నిఘా కోసం మంగళవారం డ్రోన్లు ఎగరవేశారు. అనంతరం అటవీ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో సీఐ రేవతమ్మ మాట్లాడుతూ నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. అన్ని రహదారుల్లోనూ డ్రోన్ సాయంతో గంజాయి రవాణాను గుర్తించి, సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపడతామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో గొలుగొండ ఎస్‌ఐ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.60.31 లక్షలతో అభివృద్ధి పనులు



వెంకునాయుడుపేటలో భూమి పూజ చేసి డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న పద్మావతి

నర్సీపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో రూ.60.31 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులు చేపడుతున్నామని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి చెప్పారు. పట్టణంలోని 16వ వార్డు శారదా నగర్‌లో రూ.21 లక్షలతో రెండు అభివృద్ధి పనులు, 21వ వార్డులో రూ.10.09 లక్షలతో మూడు పనులు, 22 వార్డు వెంకునాయుడుపేటలో రూ.7.68 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, 23వ వార్డు బొంతువీధిలో రూ.21.52 లక్షలతో మూడు అభివృద్ధి పనులకు ప్రారంభించడానికి మంగళవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మునిసిపాలిటీలో రూ.4 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆళ్ల మంగరాజు, కౌన్సిలర్లు డబ్బీరు శ్రీకాంత్, మూలపర్తి రామరాజు, పెదిరెడ్ల దివ్య, నేరెళ్ల సీత చంద్రిక, రావాడ నాయుడు, దన్నిన రాంబాబు, నాగేంద్రరాజు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయి తొలగింపుపై విచారణ

గొలుగొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు ఏకమై తమ ఇంటి తాగునీటి కుళాయి తొలగించారని జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీలో శివారు జానకిరాంపురం గ్రామంలో ఆర్.కన్నయ్యనాయుడు ఇంటికి సంబంధించిన కుళాయిని గ్రామస్థులు అందరూ తొలగించారని గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామంలోని రామాలయం వద్ద ఈవోపీఆర్‌డీ విచారణ చేపట్టారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఈవోపీఆర్‌డీ తెలిపారు.

గుణిపూడి పీహెచ్‌సీకి వైద్య సామగ్రి వితరణ

నర్సీపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలంలోని గుణిపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎన్ఆర్ఐ ఉట్రేవు వెంకటరామదాసు రూ.1.3 లక్షలు విలువ చేసే వైద్య సామగ్రిని వితరణ చేశారు. వీటిని ఆయన మేనల్లుడు పాలెపు రామకృష్ణ చేతుల మీదుగా వైద్యాధికారికి అందజేశారు. ఏరియా ఆస్పత్రిలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమక్షంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్ ఎన్ఆర్ఐను అభినందించారు. విదేశాలలో స్థిర పడిన ఈ ప్రాంతానికి చెందినవారు పాఠశాలలు, ఆస్పత్రులు అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండవ రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, సుర్ల సోమునాయుడు పాల్గొన్నారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని లింగంపేట గ్రామ శివారు సరుగుడు తోటలో పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. ఆ సమయంలో పేకాటాడుతున్న తొమ్మిది మందిని పట్టుకుని, రూ.5,300 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో పేకాట, కోడి పందేలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరిగితే ప్రజలు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఎస్‌ఐ కోరారు.

బైక్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు

మాకవరపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అర్జున్ ద్విచక్ర వాహన చోరీకి గురైనట్టు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం తన పొలంలో పనులు ముగించుకుని ఇంటి వద్ద ద్విచక్ర వాహనం ఉంచి నిద్ర పోయానని, మంగళవారం ఉదయం ఆరు గంటలకు లేచి చూసేసరికి వాహనం కనిపించలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అర్జున్ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ దామోదరనాయుడు తెలిపారు.

ఇంటి స్థలం ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు విన్నవిస్తున్న దివ్యాంగుడు

గొలుగొండ, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): ఏఎల్.పురం గ్రామంలో తమ ఇంటి స్థలాన్ని ఆకరమిం చారని మజ్జి నూకన్న అనే దివ్యాంగుడు తహసీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసు స్టేషన్‌కు ఎదురుగా ఉన్న కాలనీలో 1992లో తన తండ్రికి రెండు సెంట్ల స్థలాన్ని ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం పట్టా మంజూరు చేసినట్టు చెప్పారు. దీంతో జగనన్న కాలనీలో ఇంటి పట్టా ఉన్న వ్యక్తి తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని ఎంపీపీ గజ్జలపు మణికుమారి ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించాడు. సమస్యను పరిష్కరిస్తామని దివ్యాంగుడికి తహసీల్దార్ హామీ ఇచ్చారు.

గబ్బాడలో సీపీఐ రెండో మహాసభలు



సభలను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బాలేపల్లి

నర్సీపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గబ్బాడ గ్రామంలో మంగళవారం సీపీఐ రెండో మహాసభలు జరిగాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ రెండుసార్లు అధికారంలో ఉండి దేశాన్ని దివాలా తీయించారని విమర్శించారు. కేవలం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడానికి ఆయన పరిపాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను తన గుప్పెట్లో పెట్టుకొని ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించిన వారిని బెదిరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నూతన సమితి మండల కార్యదర్శిగా కామిరెడ్డి లక్ష్మీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు డీసీహెచ్ క్రాంతి, మాకిరెడ్డి రాము నాయుడు, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో దొంగతనాల నిర్మూలన

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చునని ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక వర్తక సంఘం వ్యాపారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుకాణాల యాజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని దొంగతనాలు నిర్మూలనకు సహకరించాలని కోరారు. దుకాణాల ముందు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాలు నిలుపుదల చేసేలా జాగత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

నూతన గృహాలకు రూ.2.77 లక్షలు మంజూరు

-ఎం.సూరిబాబు, హౌసింగ్ ఏఈ



కొత్తగా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.77 లక్షలు మంజూరు చేస్తుంది. ఇందులో కేంద్రం వాటా రూ.1.5 లక్షలు, రాష్ట్రం వాటా రూ.లక్ష కాగా, మిగిలిన రూ.27 వేలు ఉపాధి హామీ పథకం ద్వారా కేటాయించింది. మండల వ్యాప్తంగా కొత్త ఇళ్ల కోసం 680 దరఖాస్తులు వచ్చాయి. అలాగే పాత గృహాలను నిర్మించుకునే బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.50 వేలు ఇస్తుంది.

ప్రశ్న: కొత్త గృహాలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జవాబు: 680 దరఖాస్తులు వచ్చాయి.

ప్రశ్న: ప్రస్తుతం ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి?

జ: ఎల్‌పీసీలు తీసుకున్న దరఖాస్తుదారులందరికీ మంజూరు చేస్తాం.

ప్రశ్న: ఎల్‌పీసీలు ఎన్ని వచ్చాయి?

జ: ప్రస్తుతం 155 ఎల్‌పీసీలు కార్యాలయానికి చేరాయి.

ప్రశ్న: ప్రస్తుతం గృహ నిర్మాణానికి ప్రభుత్వం ఎంత మంజూరు చేస్తుంది?

జ: రూ.2.77 లక్షలు.

ప్రశ్న: గత ప్రభుత్వంలో ఎన్ని గృహాలు మంజూరయ్యాయి? ఎన్ని పూర్తయ్యాయి?

జ: 815 గృహాలు మంజూరయ్యాయి. 485 గృహాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 210 గృహాలు పూర్తయ్యాయి.

ప్రశ్న: సొంత స్థలాల్లో ఎన్ని గృహాలు మంజూరయ్యాయి? ఎన్ని ప్రారంభించారు? ఎన్ని గృహాలు పూర్తయ్యాయి?

జ: 981 గృహాలు మంజూరయ్యాయి. 433 నిర్మాణాలు ప్రారంభించారు. 390 గృహాలు పూర్తయ్యాయి. 548 మంది ఇంకా నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉంది.

ప్రశ్న: పాత గృహాల నిర్మాణానికి ప్రభుత్వం ఏమైనా ప్రోత్సాహం ప్రకటించిందా?

జ: పాత గృహాల నిర్మాణాలు ప్రారంభిస్తే బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహం ప్రకటించింది. గృహ నిర్మాణాలపై ప్రజాప్రతినిధులు, కార్యదర్శుల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తున్నాం.

-చీడికాడ, ఆంధ్రజ్యోతి

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని ఆందోళన

చీడికాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించు కోవాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు డిమాం డ్ చేశారు. మంగళవారం కొండ్లకొత్తూరులో పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉజ్వల సిలెండర్ల ధర కూడా పెంచడం అన్యాయమన్నారు. నాయకులు కన్నబాబు, బొబ్బాది నాగరాజు, సన్నిబాబు పాల్గొన్నారు.

రుణాల ఇంటర్వ్యూలకు 359 మంది హాజరు

దేవరాపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలు పొందడానికి మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 359 మంది హాజరయ్యారని ఎంపీడీఓ సువర్ణరాజు తెలిపారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలకుగాను 91 యూనిట్లు మంజూరు కాగా, 816 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంటర్వ్యూలకు 359 మంది హాజరయ్యారు. దేవరాపల్లి, ఎం.అలమండ ఎస్‌బీఐ, గ్రామీణ వికాస్ బ్యాంకు, డీసీసీబీ, యూకో బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ సువర్ణరాజు, ఏఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పోలమాంబ ఆలయంలో ద్వారం ఏర్పాటు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల రెల్లివీధిలో నూతనంగా నిర్మిస్తున్న పోలమాంబ అమ్మవారి ఆలయంలో గర్భగుడిలోకి వెళ్లేందుకు ద్వార మందం ఏర్పాటు చేశారు. స్థానిక వీధిలోని భక్తులు పలువురు దాతల విరాళంతో ఆలయ నిర్మాణం జరుగుతున్నది. కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ వరహాలు, రాజు మాస్టారు, పోలరాజు పాల్గొన్నారు.

భూ వివాదంలో కిరాయి వ్యక్తులు దాడి

పోలీస్ స్టేషన్‌లో ఎ.కొత్తపల్లి మహిళలు ఫిర్యాదు



విలేకరులతో మాట్లాడుతున్న బాధిత రైతులు

దేవరాపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పొలంలోకి వెళ్తున్న తమపై కిరాయి వ్యక్తులు దాడి చేశారంటూ ఎ.కొత్తపల్లికి చెందిన లక్కరాజు దేముడమ్మ, కంచిపాటి పద్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎ.కొత్తపల్లిలో 6.80 ఎకరాల భూమిని 21 ఏళ్లుగా తాము సాగు చేస్తున్నామని, ఈ భూమి విషయంలో వేరొకరితో కోర్టులో వివాదం నడుస్తుందని లక్కరాజు దేముడమ్మ, కంచిపాటి పద్మ తెలిపారు. ఈ భూమిపై స్టేటస్ కో ఆర్డర్ కోర్టు ఇచ్చిందన్నారు. అయితే సింగందొరపాలెంకు చెందిన వెలుగ పైడంనాయుడు తాను కొనుగోలు చేశానంటూ తరచూ దౌర్జన్యం చేస్తున్నాడని వారు ఆరోపించారు. మంగళవారం పొలంలోకి వెళ్తుండగా విశాఖపట్నంకు చెందిన 30 మంది కిరాయి వ్యక్తులు దాడి చేశారన్నారు. తమ దగ్గర ఉన్న యాసిడ్‌తో దాడి చేస్తామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కిరాయి వ్యక్తులను తాము ప్రశ్నించగా సింగందొర పాలెంకు చెందిన పైడంనాయుడు పంపించారని చెప్పారని బాధిత మహిళలు తెలిపారు. వారిని పట్టుకునే ప్రయత్నంలో కొందరు పారిపోగా ఐదుగుర్ని పట్టుకొని పోలీసులకు అప్పగించామన్నారు. దౌర్జన్యాలకు దిగిన కిరాయి వ్యక్తులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా రెవెన్యూ రికార్డుల ఆధారంగా కొనుగోలు చేసిన భూమిలోకి వెళ్తుండగా ఎ.కొత్తపల్లికి చెందిన వారు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పైడంనాయుడు తెలిపారు.

త్వరలో చోడవరంలో అన్న క్యాంటీన్ ప్రారంభం

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు

చోడవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అన్న క్యాంటీన్ త్వరలో ప్రారంభం కానున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో భాగంగానే చోడవరంలో అన్నక్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో రోలుగుంట, వడ్డాది, రావికమతం మండలాల్లోని మూడు కేజీబీవీ పాఠశాలల భవనాలకు రూ.4.8కోట్లు మంజూరయ్యాయన్నారు. అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ కార్యాలయ కాంప్లెక్స్ భవనాలు పూర్తికి రూ.కోటి 60 లక్షలు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ఈ భవనంలో సబ్‌ట్రెజరీ కార్యాలయం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే వడ్డాది నుంచి చోడవరం మండలం గంధవరం వరకూ బీఎన్.రహదారి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, బీజేపీ ఇన్‌చార్జి కందర్ప రమణమూర్తి, గోకివాడ కోటేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్ పాల్గొన్నారు.

మూడేళ్లలో అన్ని పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



ఖండివరం సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు, తదితరులు

చీడికాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో అన్ని పంచాయతీల్లోను మూడేళ్లలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు పూర్తిచేస్తామని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలో ఖండివరంలో సీసీరోడ్డు, ఎల్‌బీ.పట్నం, జి.కొత్తపల్లి, మంచాల, బైలపూడి, జైతవరం, కోనాం, వాకపల్లి, గుడివాడ గ్రామాల్లో సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అలాగే జి.కొత్తపల్లి, వాకపల్లి, కె.కొత్తూరు, గుడివాడ, జీజే.పురం, చినగోగాడల్లో నిర్మించిన రక్షిత నీటిపథకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కొల్లి సూరినాయుడు, బండారు వెంకటలక్ష్మి, చలుగు ఈశ్వరమ్మ, కోడూరు సత్యవతి, జాజిమొగ్గల గంగతల్లి, శీరంరెడ్డి లక్ష్మి, పైల ముత్యాలనాయుడు, చలుగు ఈశ్వరమ్మ, కసిరెడ్డి భాగ్యలక్ష్మి, గాడి నాగరత్నం, ఎంపీపీ కురచా జయమ్మ, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, బండారు దయాకర్, ఎస్‌వీఎస్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం

పౌష్టికాహారంతోనే తల్లి, బిడ్డలకు ఆరోగ్యమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని కోనాం అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గురు గర్భిణులకు ఆయన సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ, సీడీపీవో శ్రీదేవి, ఎంపీడీవో హేమసుందరరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ.కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, టీడీపీ నాయకులు రెడ్డి సన్యాసినాయుడు, గండి ముసలినాయుడు, రెడ్డి రాము, పంచాడ దాలెంనాయుడు, శరగడం శివ, బీశ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కిరాణా షాపులో చోరీ

మాడుగుల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో గల ఓ కిరాణా షాపులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానిక కిరాణా వ్యాపారి అద్దిపల్లి కొండలరావు రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి కిరాణా షాపు మూసేసి జంక్షన్‌లో గల ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం కిరాణా షాపు తెరిచి చూడగా వెనుక వైపు ఉన్న రేకు డోర్ పెకిలించినట్టు కనిపించింది. లోపలికి వెళ్లగా క్యాష్ కౌంటర్‌లో రూ.50వేలు అపహరణకు గురైనట్టు గుర్తించారు. వెంటనే మాడుగుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నారాయణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

150 మందికి నేత్ర పరీక్షలు

మాకవరపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూరుగుపాలెం గ్రామంలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 150 మంది రోగులు హాజరై నేత్ర ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో సుమారు 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్‌కు తరలించినట్టు టీడీపీ శంకర్ ఫౌండేషన్ మేనేజరు అరుణ్‌కుమార్ తెలిపారు.

ఊరు బాట పట్టిన జూనియర్ కాలేజీ అధ్యాపకులు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): మం డలంలోని వడ్డాది ప్రభుత్వ జూని యర్ కళాశాల అధ్యాపకులు ఊరు బాట పట్టారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థుల చేర్పిం చేందుకు ముకుంద పురం, ఆర్.భీమ వరం గ్రామాలలో అధ్యాపకులు పర్యటించారు. కళాశాల అధ్యాపకులు రోజుకో గ్రామంలో పర్యటిస్తున్నారని ప్రిన్సిపాల్ వైవీఎల్ అన్నపూర్ణ తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో చేరితే నాణ్యమైన విద్య బోధనతోపాటు నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బ్యాగు, మధ్యాహ్న భోజనం, వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, నర్సింహమూర్తి, ముత్యాలమ్మ, నారిబాబు పాల్గొన్నారు.

కొవ్వూరులో ఉపాధి హామీ పనులు ప్రారంభం

రోలుగుంట, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఐటీ డీపీ మండల ఇన్‌చార్జి బంటు రాజు, మాజీ సర్పంచ్ కోలిపల్లి ఈశ్వరరావు కోరారు. మంగళవారం కొవ్వూరులో ఉపాధి హమీ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కూలీలకు మెరుగైన మౌలిక సదుపాయాలను అధికారులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పలువురు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

రెండు గిరిజన గ్రామాలకు తాగునీరు

▸▸ ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కేటీ.పాలెంలో కొళాయిలు ద్వారా నీటి సరఫరా

దేవరాపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వాలాబు శివారు కొత్తూరు, కేటీ పాలెం గ్రామాలకు తాగునీటి సౌకర్యాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కల్పిం చారు. ఈనెల 1వ తేదీన 'గిరిజన గ్రామాల్లో దాహం కేకలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథ నానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చంద్రశేఖర్ స్పందించారు. రెండు గ్రామాల్లో 20 గిరిజనుల ఇళ్లకు కొళాయిల కనెక్షన్లు ఇచ్చారు. దీంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

'ఎమ్మెల్యే దృష్టికి ఆటో కార్మికుల సమస్యలు'



ఆటో కార్మికులతో సమావేశమైన దృశ్యం

కె.కోటపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులు సీరియల్ పెట్టుకొనుటకు, విశ్రాంతి తీసుకొనుటకు వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు బోజంకి సూర్యానారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని ఆనందపురం జంక్షన్ నాలుగురోడ్ల కూడలిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామకృష్ణరాజుకి, అనకాపల్లి జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షులు రొంగలి గోపాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. సమావేశంలో యూనియన్ ప్రెసిడెంట్లు మూనూరి శ్రీనివాసరావు, రంది రాజు, నీలి కోటి, ఆటో కార్మికవర్గం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐతంపూడిలో మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన ముచ్చకర్ల వెంకటరావు లక్ష రూపాయల చెక్కును జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు చేతుల మీదుగా స్థానిక సర్పంచ్ పెద్దాడ నాయుడు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరావును పలువురు అభినందించారు.

గిరిజనులతో డిప్యూటీ సీఎం మమేకం


అరకులోయ మండలం సుంకరమెట్ట కాఫీ ఎస్టేట్‌లో ఫొటో గ్యాలరీ ప్రదర్శనలో భాగంగా విత్తనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అల్లూరి జిల్లా పర్యటనలో భాగంగా రెండవ రోజైన మంగళవారం డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామాన్ని సందర్శించారు. అక్కడి గిరిజనులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆ గ్రామంలో పవన్‌కల్యాణ్ రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అరకులోయ మండలం సుంకరమెట్ట సమీపంలో కాఫీ తోటల్లో ఏర్పాటు చేసిన చెక్క వంతెనకు ప్రారంభించారు. అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

- డుంబ్రిగుడ, అరకులోయ/ఆంధ్రజ్యోతి


కురిడి గ్రామంలో రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, చిత్రంలో పవన్‌కల్యాణ్, దొన్నుదొర, అధికారులు


పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న కురిడి గ్రామస్థులు


సుంకరమెట్ట కాఫీ తోటల్లో కాఫీ ట్రయల్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పవన్‌కల్యాణ్, సుజయకృష్ణరంగారావు, అధికారులు


డిప్యూటీ సీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్

నేడు మంత్రి లోకేశ్ రాక

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం విశాఖపట్నం రానున్నారు. సాయంత్రం 7.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్న ఆయన రోడ్డు మార్గంలో పార్టీ కార్యాలయానికి వెళతారు. అక్కడే రాత్రి బస చేస్తారు. గురువారం ఉదయం 10.15 గంటలకు జిల్లా కోర్టుకు వెళతారు. తనపై తప్పుడు కథనం ప్రచురించిందని 'సాక్షి' దినపత్రికపై ఆయన గతంలో పరువు నష్టం దావా వేశారు. ఆ కేసు విచారణకు ఆయన హాజరుకానున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరి విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు వెళతారు.

16న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ కార్య నిర్వాహక అధికారి పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు హాజరుకావాలని కోరారు.

నేత్రపర్వంగా అప్పన్న వార్షిక కల్యాణం


ఎదురుసన్నాహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించిన అప్పన్న రథోత్సవంలో పాల్గొన్న భక్త జనం

సింహాచలం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీనృసింహుని వార్షిక తిరుకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల హరినామ స్మరణ నడుమ కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ముఖ్యమైన ఎదురు సన్నాహోత్సవాన్ని రాత్రి 6.30 గంటలకు ప్రారంభించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ముత్యాల పల్లకిలో భూదేవి, నీలాదేవి అమ్మవార్లను అధిష్ఠింపజేసి మాడవీధిలో ఏర్పాటు చేసిన వేదికపై ఉంచి వాద, సంవాదాలతో వేడుక నిర్వహించారు. ఎదురుసన్నాహం అనంతరం దేవేరులతో స్వామివారిని రాజగోపురం ఎదురుగా శోభాయమానాంగా తీర్చిదిద్దిన రథంలో అధిష్ఠింపజేసి విశేష అలంకరణలు చేశారు. అనంతరం మాడవీధుల్లో రథయాత్ర సాగింది. అనంతరం నృసింహ మండపం మధ్యలో ప్రత్యేక వేదికపైకి స్వామి, అమ్మవార్లను తోడ్కొని వచ్చారు. స్థానాచార్యులు టీడీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో వార్షిక తిరుకల్యాణమహోత్సవానికి శ్రీకారం చుట్టారు. శుభముహూర్తవేళ స్వామి, అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ఉంచారు. భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాంగల్యధారణ గావించారు. ముత్యాలు కలిపిన తలంబ్రాలతో అక్షతారోపణం చేపట్టారు.

టీడీఆర్ బాండ్లకు ససేమిరా

- నష్టపరిహారంగా డబ్బులే ఇవ్వాలి
- అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులు డిమాండ్
- తిమ్మరాజుపేట జంక్షన్‌లో ఆందోళన

మునగపాక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులు టీడీఆర్ బాండ్లు వద్దని, నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ తిమ్మరాజుపేట జంక్షన్‌లో ఆందోళనకు దిగారు. రోడ్డు విస్తరణ తరువాత ఇరువైపులా నిర్మించుకునే ఇళ్లు, దుకాణాల విషయంలో ఆటంకాలు కల్పించవద్దని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇళ్లు, వాణిజ్య భవనాలు, షాపులు కోల్పోయిన వారికి స్థలాలు ఇచ్చి పునరావాసం కల్పించాలని, రోడ్డు విస్తరణ వల్ల కూల్చివేసే కట్టడానికి ప్రస్తుత నిర్మాణ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అంతకుముందు తిమ్మరాజుపేట సచివాలయంలో టీడీఆర్ బాండ్లపై వీఎంఆర్డీఏ ప్రతినిధి అమ్మాజీరావు, రెవెన్యూ డీటీ శేషుబాబులు నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. టీడీఆర్ బాండ్లను రాష్ట్రంలో ఎక్కడైనా విక్రయించుకునే అవకాశం ఉందని చెప్పారు. అయితే టీడీఆర్ బాండ్లకు భూములు ఇచ్చేదిలేదని, నష్టపరిహారంగా డబ్బులే ఇవ్వాలని నిర్వాసితులు స్పష్టం చేశారు. అధికారులు నచ్చచెప్పే ప్రయత్నం చేసినప్పటికి నిర్వాసితులు వినిపించుకోలేదు. దీంతో అధికారులు సమావేశాన్ని అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయారు.


టీడీఆర్ బాండ్లు వద్దంటూ తిమ్మరాజుపేట జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ప్రారంభం

- ఏడేళ్ల నాటి కల సాకారం
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల నాటి కల సాకారం అయిందని, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. మంగళవారం ఆయన కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ నేచురోపతి, యోగా సెంటర్ పెట్టాలన్న ఆలోచనతో ఏడేళ్ల క్రితం భవనం నిర్మించామన్నారు. తరువాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ నర్సీపట్నం వచ్చినప్పుడు ఈ భవనాన్ని చూపించానని, ఆమె స్పందించి రూ. 9లక్షలు మంజూరు చేయడంతో మిగిలిన పనులు పూర్తి చేసి ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ రీజనల్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీఎస్ యశోద, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, జనసేన నాయకుడు సూర్యచంద్ర, తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఐదు రోజుల్లో చెదురుమదురు వర్షాలు

- వరి, రాగి పంటల కోతలు వాయిదా వేసుకోండి
- అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాగల ఐదు రోజుల్లో అనకాపల్లి జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ సిహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం ఇక్కడ శాస్త్రవేత్తలతో నిర్వహించిన సమావేశంలో రాగల ఐదు రోజుల వాతావరణంతోపాటు ప్రస్తుతం పొలాల్లో వున్న పంటల సస్యరక్షణ చర్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్ష సూచన ఉన్నందున వరిపైరు కోతలను వాయిదా వేసుకోవాలని, ఒకవేళ ఇప్పటికే కోసి ఉంటే పనలను కుప్పలుగా వేసుకుని టార్పాలిన్ కప్పాలని సూచించారు. కోత దశలో ఉన్న రాగి పైరును కోయడం వాయిదా వేసుకోవాలని, వర్షాల అనంతరం గింజలు ముదురు గోధుమ రంగులో ఉన్నప్పుడు, వెన్నుకు దగ్గర ఆకులు పండినప్పుడు పంటను కోయాలని ఏడీ సూచించారు. పూత దశలో ఉన్న నువ్వు పైరును కాయ తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున వీటి నివారణకు క్లోరిపైరిఫాస్ లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్ల చొప్పున కలుపుకుని పిచికారీ చేయాలని తెలిపారు. వేరు, కాండం కుళ్లు తెగులు ఆశించినట్టయితే కాపర్‌ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్ మందు లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి మొక్క మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలని తెలిపారు.

చెరకు కార్సీ చేసిన 45 రోజులకు ఎకరాకు 150 కిలోల యూరియాను మొక్కల మొదళ్ల దగ్గర చిన్న గుంతలు తీసి వేసుకోవాలని, మొక్క తోటలైతే 45, 90 రోజులలకు ఎకరాకు 75 కిలోల చొప్పున యూరియాను మొక్కల మొదళ్ల దగ్గర చిన్న గుంతలు తీసి వేసుకోవాలన్నారు. సమావేశంలో శాస్త్రవేత్తలు టి.శ్రీలత, కె.వి.రమణమూర్తి, భవాని, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి పాల్గొన్నారు.

విశ్వనాథ్ ఆక్వా స్పోర్ట్స్‌లో బాలుడి మృతి

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వాటర్ స్పోర్ట్స్ ఆడుకోవడానికి వెళ్లిన ఓ బాలుడు మృతిచెందాడు. విశాఖపట్నం పోర్టు స్టేడియంలో విశ్వనాథ్ ఆక్వా స్పోర్ట్స్ నిర్వహిస్తున్నారు. వేసవి కావడంతో పిల్లలు పెద్ద సంఖ్యలో వెళుతున్నారు. మంగళవారం సాయంత్రం మాధవధారకు చెందిన వాసుపల్లి గంగాధర్ భార్యతో కలిసి తన ముగ్గురు పిల్లలను తీసుకొని అక్కడకు వెళ్లారు. పిల్లలు ఒక్కొక్కరికి రూ.800 చొప్పున రూ.2,400 పెట్టి మూడు టికెట్లు కొని వారిని లోపలకు పంపించారు. తల్లిదండ్రులు బయట ఉండి చూస్తున్నారు. కొద్దిసేపటికి కాఫీ తాగడానికి వారిద్దరూ పక్కకు వెళ్లారు. వారు తిరిగి వచ్చేసరికి ఏడేళ్ల కుమారుడు రుషి కనిపించలేదు. అక్కడి వారిని అడిగితే నీటిలో మునిగిపోయాడని, సమీపానున్న ఎన్ఆర్ఐ ఆస్పత్రికి బైకుపై తీసుకువెళ్లారని చెప్పారు. దాంతో పరుగు పరుగున ఆస్పత్రికి వెళ్లారు. అయితే అప్పటికే బాలుడు మరణించాడని ఆస్పత్రి వర్గాలు స్పష్టంచేశాయి. దీనిపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం సాయంత్రం ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా సరైన భద్రత చర్యలు చేపట్టకపోవడం వల్లే పిల్లాడు చనిపోయాడని, అక్కడ ఇంకా అనేక అడ్వంచర్ గేమ్స్ ఉన్నాయని, వాటికి ఐఎస్ఓ సర్టిఫికేషన్ ఉందా?, లేదా?...అనేది పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు డిమాండ్ చేశారు.

క్రైం... crime news

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు
- పరారైన మరొకరి కోసం గాలింపు

నాతవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తాండవ సెంటర్‌లో మంగళవారం ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశామని ఎస్ఐ సీహెచ్ భీమరాజు తెలిపారు. పరారైన మరొకరి కోసం గాలిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నాతవరం మండలం తుని- నర్సీపట్నం మార్గంలోని తాండవ సెంటర్‌లో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఈ క్రమంలో నలుగురు వ్యక్తులు సంచులతో నడిచి వెళుతుండగా అనుమానం వచ్చి తనిఖీ చేశారు. ఆ సంచుల్లో ఆరు కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వారిలో గుంటూరుకు చెందిన షేక్ ఖాసీం, షేక్ తాజుద్దీన్, నాతవరం గ్రామానికి చెందిన సాన స్వామిలను అరెస్టు చేశారు. చింతపల్లి మండలం జోహార్ గ్రామానికి చెందిన కొర్రా మురళి పరారయ్యాడని, అతని కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కి'లేడీ'

- తక్కువ ధరకే స్థలాల పేరుతో మోసం
- విశాఖలో పలువురు బాధితులు

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్ను అధికారినని, చాలా ధనవంతురాలినని, తన సొమ్ము రూ.వంద కోట్లు సీబీఐ స్వాధీనం చేసుకుందని కథలు అల్లుతూ ఓ కి'లేడీ' జనాన్ని మోసగించింది. భీమిలి, పెందుర్తి, తగరపువలస, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో పలువురిని మోసం చేసినట్టు తెలిసింది. భీమిలి సంగివలస కాలనీకి చెందిన అత్తిలి తరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆమెపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదుచేశారు. సీఐ మురళి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

భీమిలిలోని తరుణ్‌కుమార్ ఇంటి పక్కన 2020లో దేవీరావు అనే మహిళ ఇంటిని అద్దెకు తీసుకుంది. ఆమెకు గేదెల సన్యాసప్పుడు అనే సహాయకుడు ఉండేవాడు. అతడితో కలిసి తక్కువ ధరకు స్థలాలు ఇస్తానంటూ ప్రచారం చేసుకుంది. భూములకు చెందిన డాక్యుమెంట్లు (నకిలీ) చూపించింది. ఆమె మాటలను నమ్మిన తరుణ్‌కుమార్ 2021, 2023 మధ్య కాలంలో రూ.15 లక్షలు చెల్లించాడు. అయినప్పటికీ స్థలం రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో, తన డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. తన సొమ్ము రూ.100 కోట్లు సీబీఐ ఆధీనంలో ఉండిపోయిందని, అది విడుదలైన తర్వాత సొమ్ముకు రెట్టింపు ఇస్తానని, మరో రూ.3 లక్షలు ఇవ్వాలని అడిగింది. దీంతో తనను మోసం చేసిందని గ్రహించిన తరుణ్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా దేవీరావు పెందుర్తిలోని ఎం.సతీష్, తగరపువలసలో వెంకటలక్ష్మి, మద్దిలపాలెం వాసి శ్యామ్‌కుమార్ నుంచి కూడా డబ్బులు వసూలు చేసినట్టు బయటపడింది. దీంతో బాధితులు మరింత మంది ఉండవచ్చని భావించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతో గంజాయి కట్టడి

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో 15 పడకలతో డీఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 42 కేసుల్లో 178 మంది గంజాయి నిందితులను గుర్తించామని, వీరిలో 138 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. అనంతరం 1972 టోల్‌ఫ్రీ నంబరుపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ దేవప్రసాద్, ఆర్డీఓలు షేక్ ఆయీషా, వీవీ రమణ, డ్రగ్ కంట్రోల్ ఏడీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు హంగులు!

... 5వ పేజీ తరువాయి

అసరాలనుబట్టి ఒక్కో దానికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు మంజూరు చేసింది. మొత్తం 29 వసతిగృహాలకు రూ.4.2 కోట్లు కేటాయించింది. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 18 వసతిగృహాల్లో పనులు మొదలయ్యాయని, సగానికి పైగా పనులు పూర్తయ్యాయని ఈఈ నరసింహారావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మిగిలిన 11 వసతిగృహాల మరమ్మతు పనులు ఏపీ మౌలిక వసతుల కల్పన ఇంజనీరింగ్ విభాగం చేపట్టింది. భవనాలకు మరమ్మతులు, తాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్లు, విద్యుత్తు, ఫ్లోరింగ్, కిటికీలకు దోమతెరల ఏర్పాటు వంటి పనులు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంనాటికి మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు.

వసతి గృహాలకు కొత్త వంట సామగ్రి

సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో వంట పాత్రలు, ఇతర సామగ్రి పాతబడిపోయి, వంట కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అన్ని వసతిగృహాలకు కొత్త సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేసింది. ఐదు లీటర్ల వెట్ గ్రైండర్, 10 లీటర్ల సామర్థ్యం కలిగిన పెద్ద ప్రెషర్ స్టీల్ కుక్కర్, ఇడ్లీ పాత్రలు, పెద్ద తపేలాలు, గరిటెలు, గిన్నెలు, సాంబరు బకెట్లు ఇలా మొత్తం 30 రకాల వంట సామగ్రిని ఆయా వసతిగృహాలకు పంపిణీ చేశారు.

'ప్రైవేటు'కు ప్రసూతి కేసులు

... 5వ పేజీ తరువాయి

వస్తున్నదని, అయితే సోలార్ యూనిట్ ఉండడంతో రూ.80 వేలు చెల్లిస్తే సరిపోతున్నదని అధికారులు తెలిపారు. కొత్త ఓపీ విభాగం భవనానికి సోలార్ అమర్చడానికి ఎంత అవుతుందని ప్రశ్నించగా, రూ.20 లక్షలు అవుతుందని సంబంధిత డీలర్ చెప్పారని సూపరింటెండెంట్ తెలిపారు. ఇంకా ఒకరిద్దరు డీలర్లతో మాట్లాడితే రూ.2-3 లక్షలు తగ్గే అవకాశం ఉందని, వెంటనే సోలార్ ఏర్పాటు చేయాలని, కరెంటు బిల్లు భారం ఇంకా తగ్గిపోతుందని అన్నారు. ఏరియా ఆస్పత్రికి అవసరమైన వైద్య సిబ్బందిని మంజూరు చేయాలని డీసీహెచ్ఎస్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. గచ్చపువీధి వైపు ఉన్న పోస్టుమార్టం గది వల్ల దుర్వాసనతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రత్యామ్నాయం ఆలోచించాలని స్పీకర్ సూచించారు. గొలుగొండ మండలం చీడిగుమ్మల పీహెచ్‌సీ చిన్న గదిలో, సచివాలయం పెద్ద భవనంలో ఉందని, వీటిని మార్చడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్ సూచించారు. సీఎస్ఆర్ నిధులతో ఏరియా ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వార్డుల్లో బెడ్‌లకు రోజుకో రంగు చొప్పున ఏడు రంగుల బెడ్ సీట్లు వాడితే బాగుంటుందని, ఆరు రోజులు బెడ్ షీట్లు ఇవ్వడానికి దాతలు ముందుకు వచ్చారని, ఏడో రోజు బెడ్ షీట్లకు అయ్యే ఖర్చును తాను భరిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.

దుమ్ము రేగుతున్న రోడ్లు

... 5వ పేజీ తరువాయి

వాహనదారులు, రోడ్డుపక్కన ఇళ్లల్లో నివాసం వుంటున్నవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గం వైసీపీ హయాంలో నిర్వహణ పనులకు నోచుకోకపోవడంతో భారీ గోతులు ఏర్పడి దారుణంగా తయారైంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నిధులు మంజూరు చేయడంతో పనులు మొదలుపెట్టారు. అయితే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నచోట తొలుత సిమెంట్ కాంక్రీట్‌తో ఎత్తు చేస్తున్నారు. తరువాత బీటీ లేయర్ వేస్తారు. ప్రస్తుతం సీసీ రోడ్డు పనులు జరుగుతుండడంతో వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో దుమ్ము విపరీతంగా లేస్తున్నది. ముందు వెళుతున్న వాహనం సరిగా కనిపించడంలేదు. వాహనదారులు, ప్రయాణికుల కళ్లలో దుమ్ము పడి ఇబ్బంది పడుతున్నారు. తారు రోడ్డు వేసే వరకు రోజూ ఉదయం, సాయంత్రం నీటితో రోడ్డును తడపాలని స్థానికులు కోరుతున్నారు.



బూడిద కారణంగా ప్రమాదానికి గురైన బైక్, గాయపడిన యువకుడు

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439